

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 19-06-2025 | సంపుటి - 24 | సంచిక - 48 రూ : 4 | పేజీలు: 8


## చంద్రబాబుకు ఒక సూచన చేస్తున్నా

# మాకు ఎన్‌ఓసీ ఇస్తే మీకు ఒకే చెబుతాం!

### తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు చెబుతోందన్న సీఎం రేవంత్

* తమ ప్రాజెక్టులకు ఎన్‌ఓసీ ఇస్తే, ఏపీకి ఎలాంటి అభ్యంతరం చెప్పబోమన్న సీఎం
* గోదావరి-బనకచర్లపై కేసీఆర్, జగన్ 2019లోనే చర్చించారన్న రేవంత్
* కేసీఆర్ చేసిన సంతకమే తెలంగాణకు ప్రతిబంధకమన్న ముఖ్యమంత్రి
* రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేసిన రేవంత్




తెలంగాణలోని పలు సాగునీటి ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీలు) జారీ చేస్తే, ఏపీ ప్రాజెక్టులపై తాము కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పబోమని ఆయన స్పష్టం చేశారు. "ఈరోజు అందుకే నేను పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచన చేస్తున్నాను. కేంద్రంలో మీకు పలుకుబడి ఉండవచ్చు.. మీరేం చెబితే మోదీ గారు అది వినవచ్చు. అలా అని ప్రాజెక్టులన్నింటికీ అనుమతి

తరువాయి 2లో


2లో

## దేశంలో మళ్లీ కరోనా అలజడి..

### నాలుగు కొత్త ఒమిక్రాన్ సబ్ వేరియంట్లు గుర్తింపు!

- దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు
- ఒమిక్రాన్ నాలుగు కొత్త ఉపరకాలే కారణమని వెల్లడి
- ఎల్ఎఫ్.7, ఎక్స్ఎఫ్‌జీ, జేఎన్.1.16, ఎన్‌బీ.1.8.1గా గుర్తింపు
- మే నెల నుంచి ఎక్స్ఎఫ్‌జీ వేరియంట్ ప్రభావం ఎక్కువ
- ప్రస్తుతం 6483 యాక్టివ్ కేసులు, ఈ ఏడాది 113 మరణాలు
- కేరళ, గుజరాత్, కర్ణాటక, ఢిల్లీలో వైరస్ వ్యాప్తి అధికం



## బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు

2లో

## పాకిస్థాన్‌లో రైలు ట్రాక్‌పై బాంబు పేలుడు..

# పట్టాలు తప్పిన జాఫర్ ఎక్స్‌ప్రెస్

- పట్టాలు తప్పిన జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆరు బోగీలు
- సింధ్ ప్రావిన్స్‌లోని జకోబాబాద్ వద్ద ఘటన
- రైలు మార్గంలో ఐఈడీ బాంబు అమర్చినట్లు అనుమానం
- పేలుడు ధాటికి ట్రాక్‌పై మూడు అడుగుల గొయ్యి

పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రవాదులు రైలు మార్గాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. బుధవారం సింధ్ ప్రావిన్స్‌లోని జకోబాబాద్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై శక్తివంతమైన బాంబు పేలింది. ఈ ఘటనలో అటుగా వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ విషయాన్ని స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. క్వెట్టా నుంచి పెషావర్‌కు ప్రయాణిస్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు జకోబాబాద్ వద్దకు చేరుకున్న సమయంలో ఈ పేలుడు సంభవించింది. దుండగులు రైలు మార్గంలో ఐఈడీని అమర్చడం వల్లే ఈ పేలుడు జరిగిందని ప్రాథమిక సమాచారం. పేలుడు తీవ్రతకు రైలు పట్టాలపై సుమారు మూడు అడుగుల లోతైన గొయ్యి ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఆరు బోగీలు పట్టాలు తప్పడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అయితే, ఈ ప్రమాదంలో ప్రాణనష్టం లేదా గాయపడిన వారి వివరాలకు సంబంధించి పూర్తి సమాచారం ఇంకా

తరువాయి 2లో






## కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి

# చిరాగ్ పాశ్వాన్‌తో మంత్రి లోకేశ్ భేటీ

### కేంద్రమంత్రి పాశ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన లోకేశ్

- రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం అందిస్తామని పాశ్వాన్ హామీ
- 'యువగళం' పుస్తకాన్ని చిరాగ్ పాశ్వాన్‌కు అందించిన లోకేశ్

2లో

## సైన్యం భవిష్యత్తుపై మాజీ చీఫ్‌లతో ఆర్మీ చీఫ్ కీలక భేటీ

2లో

# పాకిస్థాన్‌లో రైలు ట్రాక్‌పై బాంబు పేలుడు.. పట్టాలు తప్పిన జాఫర్ ఎక్స్‌ప్రెస్

(మొదటిపేజీ తరువాయి)

తెలియాల్సి ఉంది. సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. కాగా, జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు గతంలోనూ దాడులకు గురైంది. ఈ ఏడాది మార్చి నెలలో పాకిస్థాన్‌లోని వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు ఇదే రైలును హైజాక్ చేసి, వందలాది మంది ప్రయాణికులను బందీలుగా పట్టుకున్నారు. వారిని రక్షించేందుకు వెళ్లిన పాక్ భద్రతా సిబ్బందిని కూడా మిలిటెంట్లు హతమార్చారు. అనంతరం పాక్ భద్రతా దళాలు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి బందీలను విడిపించాయి. ఇప్పుడు మళ్లీ అదే రైలు లక్ష్యంగా దాడి జరగడం కలకలం రేపుతోంది.

# దేశంలో మళ్లీ కరోనా అలజడి..

## నాలుగు కొత్త ఒమిక్రాన్ సబ్ వేరియంట్లు గుర్తింపు!

దేశవ్యాప్తంగా ఇటీవల కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ తాజా కేసుల పెరుగుదలకు ఒమిక్రాన్‌కు చెందిన నాలుగు కొత్త ఉపరకాలే (సబ్ వేరియంట్లు) కారణమని పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ) నిర్ధారించింది. జీనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా ఈ కొత్త ఉపరకాలను గుర్తించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ పరిశోధన ఫలితాలు వ్యాక్సిన్‌ల సామర్థ్యాన్ని అంచనా వేయడంలో ఉపయోగపడతాయని వారు తెలిపారు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న కరోనా కేసుల నమూనాలను విశ్లేషించినప్పుడు ఒమిక్రాన్‌కు చెందిన నాలుగు ఉపరకాలు వెలుగులోకి వచ్చినట్లు ఎన్ఐవీపుణె డైరెక్టర్ డాక్టర్ నవీన్ కుమార్ వివరించారు. "మేము వీటిని ఎల్ఎఫ్.7, ఎక్స్‌ఎఫ్‌జీ, జేఎన్.1.16, ఎన్‌బీ.1.8.1 వేరియంట్లుగా గుర్తించాం. మొదట్లో జేఎన్.1.16 వేరియంట్ వల్ల కేసులు పెరిగినా, ఈ ఏడాది మే నెల నుంచి ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఎల్ఎఫ్.7, ఎల్‌పీ.81.2 అనే రెండు వేరియంట్లు కలిసి ఎక్స్‌ఎఫ్‌జీగా రూపాంతరం చెందాయి" అని డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. కొత్త వేరియంట్లను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి జన్యుక్రమాన్ని విశ్లేషించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని ఆయన చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారం నుంచి దేశంలో కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 6,483 కొవిడ్ 19 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటివరకు కరోనా కారణంగా 113 మంది మరణించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యంగా కేరళలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉండగా, గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ రాష్ట్రాల్లో కూడా వైరస్ వ్యాప్తి అధికంగానే ఉంది. అయితే, ప్రస్తుతానికి ఇన్ఫెక్షన్ తీవ్రత తక్కువగానే ఉందని, బాధితులు ఎక్కువగా ఇళ్లలోనే ఉంటూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. వ్యాధి లక్షణాలు స్వల్పంగా ఉండటంతో ఆసుపత్రులలో చేరేవారి సంఖ్య తక్కువగానే ఉందని తెలుస్తోంది. అయినప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు

హైదరాబాద్ నగరంలోని బేగంపేట విమానాశ్రయంలో బుధవారం ఉదయం కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఈమెయిల్ ద్వారా వచ్చిన సందేశం కలకలం రేపింది. ఈ సమాచారం అందుకున్న వెంటనే నగర పోలీసులు, విమానాశ్రయ భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు హుటాహుటిన విమానాశ్రయానికి చేరుకున్నాయి. ఎయిర్‌పోర్ట్ ప్రాంగణమంతా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి మూలను గాలించినప్పటికీ ఎటువంటి పేలుడు పదార్థాలు గానీ, అనుమానాస్పద వస్తువులు గానీ లభ్యం కాలేదు. గంటల తరబడి విస్తృతంగా సోదాలు చేసిన అనంతరం విమానాశ్రయంలో ఎలాంటి బాంబు లేదని అధికారులు నిర్ధారించారు. దీంతో అటు పోలీసులు, ఇటు విమానాశ్రయ సిబ్బందితో పాటు ప్రయాణికులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. ఎవరో ఆకతాయి కావాలనే ఈ బెదిరింపు ఈమెయిల్ పంపి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈమెయిల్ పంపిన వ్యక్తిని గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఘటనతో విమానాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదని సమాచారం.

# అమర్‌నాథ్ యాత్రకు లైన్ క్లియర్.. యాత్రికుల భద్రతకు 'ఆపరేషన్ శివ' ప్రారంభం

పవిత్ర అమర్‌నాథ్ యాత్రకు హాజరయ్యే యాత్రికుల భద్రత దృష్ట్యా జమ్మూకశ్మీర్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అమర్‌నాథ్ పుణ్యక్షేత్రానికి వెళ్లే అన్ని మార్గాలను జులై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు 'నోఫ్లయింగ్ జోన్'గా ప్రకటిస్తూ కేంద్రపాలిత ప్రాంత హోం శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ కాలంలో డ్రోన్లు, బెలూన్లు, ఇతర విమానయాన సాధనాల వినియోగంపై పూర్తి నిషేధం విధించింది. ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జులై 3న ప్రారంభమై ఆగస్టు 8న ముగియనుంది. భద్రతా పరంగా అత్యంత సున్నితమైన ఈ యాత్ర నేపథ్యంలో ఇంటెలిజెన్స్ ఏజెన్సీల నుంచి తీవ్రవాద ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికలు అందాయి. ముఖ్యంగా ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని బైసరన్ మైదానంలో జరిగిన ఉగ్రదాడి, మే నెలలో భారత్‌పాకిస్థాన్ మధ్య తలెత్తిన నాలుగు రోజుల సాయుధ ఘర్షణల అనంతరం ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. యాత్రికుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు భద్రతా దళాలు 'ఆపరేషన్ శివ'ను ప్రారంభించాయి. పహల్గామ్, బల్తాల్ మార్గాల్లో యాత్రికులకు రక్షణ కల్పించడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశం.

# కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో మంత్రి లోకేశ్ భేటీ



పండ్లతోటల అభివృద్ధికి అన్నివిధాల అనుకూలమైన వాతావరణం కలిగిన రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్ కు మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ తో మంత్రి లోకేశ్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... రాయలసీమలో రైతులు మామిడి, అరటి, టమోటా, బత్తాయి, దానిమ్మ, డేట్స్ వంటి పండ్ల తోటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. అయితే, పంట చేతికొచ్చే సమయంలో గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశాను. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా అక్కడి రైతులకు మెరుగైన రేట్లు లభించి ఆదాయం పెరిగే అవకాశం ఉంది. రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు సహకరించాలని లోకేశ్ కోరారు. దీనికి కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ స్పందిస్తూ... ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తిరుపతి ట్రిపుల్ ఐటీలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి తాను ఏపీకి వస్తున్నట్లు తెలిపారు. జులై 11, 12 తేదీల్లో రాయలసీమ పర్యటనకు వస్తున్నానని పాశ్వాన్ చెప్పారు. లోకేశ్‌ను కూడా ఆహ్వానించిన మంత్రి పాశ్వాన్.. క్షేత్ర స్థాయిలో పర్యటించి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై అధ్యయనం చేద్దామన్నారు. అన్నదాతలకు మేలు చేసేందుకు మోదీజీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. 'యువగళం' పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని లోకేశ్... చిరాగ్ పాశ్వాన్ కు అందించారు.

# చంద్రబాబుకు ఒక సూచన చేస్తున్నా మాకు ఎన్‌ఓసీ ఇస్తే మీకు ఒకే చెబుతాం!

(మొదటిపేజీ తరువాయి)

వస్తుందని అనుకుంటే అది భ్రమ. అలాంటి వాటికి అవకాశం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో అవసరమైన ప్రణాళిక, వ్యూహరచన మా వద్ద ఉంది. మేము వివిధ రాజ్యాంగబద్ధమైన సంస్థలకు ఫిర్యాదు చేస్తున్నాం. అక్కడ మాకు న్యాయం జరగకుంటే న్యాయస్థానాలకు వెళతాం.. అక్కడి నుంచి ప్రజల వద్దకు వెళతాం" అని ఆయన అన్నారు. బుధవారం గోదావరి బనకచర్ల ప్రాజెక్టు అంశంపై అఖిలపక్ష ఎంపీలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు.

*** గోదావరి-బనకచర్లపై గత ప్రభుత్వాల ఒప్పందం**

2019 అక్టోబరులోనే అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించే విషయంపై చర్చించారని రేవంత్ రెడ్డి అన్నారు. "గోదావరిబనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే ఒకరకంగా అంకురార్పణ జరిగింది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్లు నాడు 'నమస్తే తెలంగాణ' పత్రికలో కథనాలు కూడా వచ్చాయి" అని ఆయన తెలిపారు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకు సాగాలనే అంశంపై విపక్షాలతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

*** కేసీఆర్ నిర్ణయాలపై రేవంత్ విమర్శలు**

2016 సెప్టెంబర్ 21న కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ, ఏటా 3 వేల టీఎంసీల గోదావరి నీరు వృథాగా సముద్రంలోకి పోతోందని అన్నారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. "ఈ విషయంపై మొదట మాట్లాడిందే కేసీఆర్. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో రికార్డుల్లో స్పష్టంగా ఉంది. తెలంగాణకు కృష్ణా నది జలాల్లో 299 టీఎంసీలు సరిపోతాయని కూడా ఆనాడే కేసీఆర్ అంగీకరించి సంతకం చేశారు. ఆ సంతకమే ఇప్పుడు తెలంగాణకు గుదిబండగా మారింది" అని ఆయన విమర్శించారు. తెలంగాణకు 968 టీఎంసీల నీటిని వాడుకునేలా ప్రాజెక్టులకు ఏపీ ఎన్ఓసీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

*** భవిష్యత్ కార్యాచరణ**

గోదావరి బనకచర్ల ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటామని చెప్పారు. ఈ విషయంలో అన్ని పార్టీలను కలుపుకొని పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.

*** సీఎం వ్యాఖ్యలను ఖండించిన బీఆర్ఎస్ ఎంపీ**

మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆనాడు తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే కేసీఆర్ మాట్లాడారని ఆయన వివరణ ఇచ్చారు. కృష్ణా నదిని కలుపుతూ గోదావరి జలాలు తీసుకెళ్తే తమకు అభ్యంతరం లేదని మాత్రమే కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. ఈ సమావేశం పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో జరుగుతోందని ఆరోపించారు.

# సైన్యం భవిష్యత్తుపై మాజీ చీఫ్‌లతో ఆర్మీ చీఫ్ కీలక భేటీ

భారత సైన్యం భవిష్యత్ కార్యాచరణ, ఆధునికీకరణ దిశగా కీలక అడుగు పడింది. సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది, పలువురు మాజీ ఆర్మీ చీఫ్‌లతో కలిసి రెండు రోజుల 'చీఫ్స్ చింతన్' సదస్సును మంగళవారం ప్రారంభించారు. ఇటీవల విజయవంతంగా ముగిసిన 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో జరుగుతున్న ఈ ఉన్నత స్థాయి సమావేశం, సైనిక వ్యూహాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అంతర్గత సంస్కరణలపై ప్రధానంగా దృష్టి సారించింది. మాజీ ఉన్నతాధికారుల అపార అనుభవాన్ని ప్రస్తుత సవాళ్లను ఎదుర్కోవడానికి, భవిష్యత్ ప్రణాళికలను పటిష్టం చేసుకోవడానికి ఈ సదస్సు వేదికగా నిలుస్తోంది. సమావేశం తొలి రోజున 'ఆపరేషన్ సిందూర్' గురించి సమగ్రంగా చర్చించారు. ఆర్మీ, వైమానిక దళం, నౌకాదళం సమన్వయంతో చేపట్టిన ఈ సంయుక్త ఆపరేషన్, కీలక ఉగ్రవాద నెట్‌వర్క్‌లను ఛేదించడంలో సఫలమైంది. "ఈ ఆపరేషన్ నిర్వహణ, వ్యూహాత్మక ప్రభావం, సంయుక్త కార్యాచరణ నమూనాను మాజీ చీఫ్‌లకు వివరంగా తెలియజేశారు. వారి నుండి విలువైన సూచనలు స్వీకరించారు. కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించడానికి చేపడుతున్న ఆధునిక సాంకేతికతల సమీకరణ, ఆధునికీకరణ కార్యక్రమాల గురించి కూడా వారికి వివరించారు" అని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ మేధోమథన సదస్సులో మూడు ప్రధాన అంశాలపై విస్తృతంగా చర్చించారు. మొదటిది, ఆధునిక యుద్ధ తంత్రంలో ముందంజలో నిలిచేందుకు ఏఐ (కృత్రిమ మేధ), రోబోటిక్స్, సైబర్ సామర్థ్యాలు వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా అందిపుచ్చుకోవడంలో భారత సైన్యం చేస్తున్న కృషి. రెండవది, 'వికసిత్ భారత్ @2047' దార్శనికతకు అనుగుణంగా దేశాభివృద్ధి లక్ష్యాలతో సైనిక ఆధునికీకరణను సమన్వయం చేయడం. మూడవది, మానవ వనరుల విధానాల్లో సంస్కరణలు తీసుకురావడం, సైన్యంలో పనిచేసిన వారికి సంక్షేమ చర్యలను మరింత మెరుగుపరచడం వంటి అంశాలు ఉన్నాయి. ఈ సదస్సులో పాల్గొన్న మాజీ ఆర్మీ చీఫ్‌లు జనరల్ వి.పి. మాలిక్, జనరల్ ఎన్.సి. విజ్, జనరల్ జె.జె. సింగ్, జనరల్ దీపక్ కపూర్, జనరల్ బిక్రమ్ సింగ్, జనరల్ మనోజ్ పాండేలకు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్వాగతం పలికారు. భారత సైన్యంలో కొనసాగుతున్న పరివర్తన, భవిష్యత్ దిశానిర్దేశంలో వారి నిరంతర భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆయన నొక్కిచెప్పారు. మాజీ సైన్యాధిపతులు తమ అనుభవాలు, విలువైన సూచనలు, సిఫార్సులను పంచుకున్నారు. ఇవి భారత సైన్యం తన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, సంస్థాగత సంస్కరణలను చేపట్టడానికి దోహదపడతాయని అధికారులు తెలిపారు. కొత్త సవాళ్లకు అనుగుణంగా మారుతూ, భవిష్యత్ ఘర్షణలకు సన్నద్ధమవుతున్న తరుణంలో, గతం మరియు ప్రస్తుత నాయకత్వం మధ్య ఈ సమన్వయం భారత సైన్యం కేవలం యుద్ధానికి సిద్ధంగా ఉండటమే కాకుండా, భవిష్యత్తుకు కూడా సంసిద్ధంగా ఉండేలా చేస్తుందని రక్షణ శాఖ పేర్కొంది.

# ఇజ్రాయెల్‌ఇరాన్ ఉద్రిక్తతల వేళ.. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు ట్రంప్ విందు

భారత్‌పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తన జోక్యంతోనే సద్దుమణిగాయని ప్రకటించుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఆ వాదనను కొనసాగిస్తూనే ఉన్నారు. మరోవైపు ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న వేళ పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్ అమెరికా పర్యటన చేపట్టారు. ఈ నేపథ్యంలో ట్రంప్ ఆయనకు విందు ఏర్పాటు చేశారు. వైట్‌హౌస్‌లోని కేబినెట్ రూమ్ ఇందుకు వేదికయ్యింది. తలుపులు మూసి ఉంచిన గదిలో ఇరువురు విందు చేశారు. ఓవైపు ఇరాన్‌కు పాకిస్థాన్‌కు సన్నిహిత దేశం కావడం.. మరోవైపు పాక్ ఆర్మీ చీఫ్ అమెరికా అధ్యక్షుడితో భేటీ కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఒక దేశానికి చెందిన ఆర్మీ చీఫ్‌కు వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు విందు ఇవ్వడం చాలా అరుదైన విషయం. అంతకుముందు అయూబ్ ఖాన్, జియా ఉల్‌హక్, పర్వేజ్ ముషారఫ్ వంటి వారికి ఆహ్వానం అందినప్పటికీ వాళ్లు పాక్ అధ్యక్షులుగా ఉన్నారు. తాజాగా మునీర్‌కు అమెరికా నుంచి ఆహ్వానం అందడాన్ని పాకిస్థాన్ అధికారులు తమ దౌత్య విజయంగా భావిస్తున్నట్లు సమాచారం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ జీ7 సదస్సు నుంచి అర్ధంతరంగా ట్రంప్ అమెరికాకు తిరిగివెళ్లారు. అనంతరం మోదీతో మాట్లాడిన ఆయన.. కెనడా నుంచి అమెరికాకు రావాలని ఆహ్వానించారు. అయితే, ముందస్తు ప్రణాళికల నేపథ్యంలో కుదరదని మోదీ చెప్పినట్లు భారత విదేశాంగశాఖ వెల్లడించింది. మరోవైపు భారత్‌పాక్ ఉద్రిక్తతలపై మరోసారి మాట్లాడిన ట్రంప్.. ఈ దేశాల మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ మళ్లీ పాతపాటే పాడారు. పాకిస్థాన్ వైపు నుంచి మునీర్, భారత్ తరపున మోదీ తదితరులు యుద్ధానికి తెరదించేందుకు చొరవ చూపారన్నారు. తద్వారా రెండు ప్రధాన అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధాన్ని ఆపానని ప్రకటించుకోవడం గమనార్హం.

# ఉప్పల్ లో జర్నలిస్టు సురేష్ సంస్మరణ సభకు తరలివచ్చిన నాయకులు

* జర్నలిస్టు సురేష్ సేవలను కొనియాడిన నాయకులు...
* జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి చేయాలి : ఉప్పల్ ఎమ్మెల్యే బిఎల్ఆర్
* జర్నలిస్టుల సేవలు మరువలేనివి : ఎన్ వి ఎస్ ఎస్
* జర్నలిస్టుకు అండగా ఉంటా : రాగిడి లక్ష్మారెడ్డి






ఉప్పల్ , (ప్రజాస్ఫూర్తి) : ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన జర్నలిస్టు మాదిరాజు సురేష్ సంస్మరణ సభకు పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు నాయకులు అధికారులు హాజరయ్యారు. బుధవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో



కేకేఆర్ గార్డెన్ లో నిర్వహించిన సంస్మరణ సభకు ప్రముఖులు హాజరై జర్నలిస్టుగా సురేష్ చేసిన సేవలను కొనియాడారు. ఉప్పల్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సురేష్ చేసిన సేవలను అభినందించారు. నాయకులు మాట్లాడుతూ సురేష్ తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉండే జర్నలిస్టు సురేష్ మృతిని ఎవరు జీర్ణించుకోలేక పోతున్నారని , ఉప్పల్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సురేష్ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వము కృషి చేయాలని ఆయన సూచించారు. సురేష్ కుటుంబానికి తనవంతుగా ప్రభుత్వంలోని పెద్దలతో చర్చించి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తానన్నారు. సురేష్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్ట్ సురేష్ ఎంతో చురుకుగా ఉండేవాడని కొనియాడారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ నిర్మాణంలో తాను ఎంతో సహకరించాలని, అదేవిధంగా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సురేష్ కూడా ఎంతో చొరవ చూపే వారని గుర్తు చేశారు. మల్కాజ్గిరి పార్లమెంటు బిఆర్ఎస్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతూనే దుర్భరమైన ఆర్థిక పరిస్థితుల్లో తమ జీవనాన్ని నెట్టుకు రావడం బాధ కలిగిస్తుందన్నారు. జర్నలిస్టులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని యావత్ సమాజం కూడా అండగా నిలవాలని కోరారు. జర్నలిస్టు సురేష్ కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఉప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ జర్నలిస్టులు నిస్వార్థంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడతారని పేర్కొన్నారు. అంతకుముందు టిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయి జన్ శేఖర్, గంధం నాగేశ్వరరావు లు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు నాయకులకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని అభినందించారు. జర్నలిస్టులకు అండగా ఉండాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని వారు గుర్తు చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు సురేష్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని, ఆర్థికంగా ఆదుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ సంస్మరణ సభకు సురేష్ సతీమణి, కూతురు తో పాటు కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సంస్మరణ సభలో పాల్గొన్న వారిలో ఉప్పల్ గ్రామ ప్రముఖుడు బండి నరసింహారెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయి జన్ శేకర్, మేకల మధుసూదన్ రెడ్డి, గుడి మధుసూదన్ రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, అన్న బాలకృష్ణ, ఏ. మోహన్ రెడ్డి, పిల్లి నాగరాజు, కొండల్ రెడ్డి, పల్లె నర్సింగరావు, పిట్టల నరేష్, ఈరెల్లి రవీందర్ రెడ్డి, కే జగన్, సుఖ కిరణ్ , నిరంజన్ , పంగ మహేందర్ రెడ్డి, తెలంగాణ సంపత్, సుధాకర్ శెట్టి, చర్ల సుధాకర్ రెడ్డి, సిపిఎం నాయకులు ఎర్రం శ్రీనివాస్, వినోద, ఊర్మిళ లు పాల్గొన్నారు. అదేవిధంగా ఈ సమావేశంలో ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఉప్పల్ తహసిల్దార్ వాణిరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ సునీల్, ఇతర మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

* జర్నలిస్టుల నివాళి...
* మీడియా అకాడ నుంచి ఆర్థిక సహాయం : టి యు డబ్ల్యూ జే

ఆకస్మికంగా మృతి చెందిన ప్రజా దర్బార్ పత్రిక రిపోర్టర్ మాదిరాజు సురేష్ జ్ఞాపకార్థం ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కేకేఆర్ గార్డెన్ లో నిర్వహించిన సంస్మరణ సభలో జర్నలిస్టులు నివాళులర్పించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోత వెంకటరెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, కార్యదర్శి దొంతుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సురేష్ కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వ మీడియా అకాడమీ నుంచి రావాల్సిన ఆర్థిక సహాయాన్ని సాధ్యమైనంత త్వరలో వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అతని కుటుంబానికి మీడియా అకాడ నుంచి ప్రతినెల రూ 3000 పెన్షన్ అందుతుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం, ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సూచించారు. జర్నలిస్టు సురేష్ సంస్మరణ సభను విజయవంతం చేయడంలో కృషి చేసిన ఉప్పల్ ప్రెస్ క్లబ్ సభ్యులందరినీ టీయూడబ్ల్యూజే నాయకులు అభినందించారు.

## పీఎం మాతృమూర్తి జయంతి వేడుకలు

* మొక్కలను నాటిన మొక్కల రాజశేఖర్, నైనిక రజువా




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పర్యావరణ పరిరక్షణకై చేపట్టిన ప్రకృతి హరితదీక్ష 1814వ రోజుకు చేరుకున్న సందర్భంగా బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ మాతృమూర్తి హీరాబెన్ జయంతిని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం రామవరం ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రకృతి హరిత దీక్ష, గ్రీన్ మోటార్ వెహికల్ గార్డెన్ వ్యవస్థాపకులు, సింగరేణియన్ కేఎన్ రాజశేఖర్ (మొక్కల రాజశేఖర్), ప్రకృతి హరిత దీక్షపరురాలు నైనిక రజువా మొక్కను నాటడం జరిగింది. ఈ సందర్భంగా మొక్కల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి సేవ చేస్తున్న వారిని గుర్తించి ప్రధానమంత్రి మోడీ ఆల్ ఇండియా రేడియో ద్వారా మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించడం సంతోషకరమని, దానిలో భాగంగా తన పేరును ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్ ద్వారా ప్రపంచానికి పరిచయం చేశారని, ఈ సందర్భంగా పీఎంకు మొక్కల రాజశేఖర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టిన 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు.

## కుషాయిగూడలో వీధి నెంబర్ బోర్డు ల ప్రారంభం

ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుషాయిగూడ మెయిన్ రోడ్ లో ఏర్పాటు చేసిన వీధి నెంబర్ బోర్డులను బుధవారం ఉదయం వీధి నెంబర్ 1 బోర్డు ( వెంకటేశ్వరస్వామి టెంపుల్ ) వీధి వద్ద బోర్డుల ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవంలో కుషాయిగూడ గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని వీధి నెంబర్ బోర్డు వద్ద కొబ్బరి కాయలు కొట్టి పూజా కార్యక్రమం నిర్వహించారు కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ లు మాట్లాడుతూ.. కుషాయిగూడ గ్రామానికి అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నాక ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవడం జరిగింది అని అందులో భాగంగానే నేడు కుషాయిగూడ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రతీ వీధికి రోడ్ నంబర్ బోర్డు లను ఏర్పాటు చేసుకోవడం జరిగింది అని అన్నారు. అలాగే ఎవరో వస్తారు ఏదో చేస్తారని వేచి చూసే రోజులు పోయాయని నేడు కుషాయిగూడలో ఏ అభివృద్ధి




కార్యక్రమం అయినా అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులందరం కలిసి కట్టుగా కుషాయిగూడ అభివృద్ధికి పాటు పడి ఇతర కాలనీ లకు దీటుగా కుషాయిగూడ అభివృద్ధికి పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, చల్లా వీరేషం, కొడకండ్ల యాదయ్య, చిత్తుల కిషోర్ గౌడ్, రాగుల వాసుదేవ ముదిరాజ్, చల్లా ప్రభాకర్, చల్లా వెంకటేష్, బలం అనిల్ బాబు, యావపురం రవి, లక్ష్మణ్ గౌడ్, చిందం బాలనర్సింహా వంశరాజ్, బ్రహ్మ చారి, సారా అనిల్ ముదిరాజ్, నాలచెరువుల జనార్దన్, దయానంద్, రాంగిరివార్ నర్సింగ్ రావు, బ్యాటరీ గోపాల్, పబ్బా చంద్రశేఖర్ , సారా శ్రీధర్ ముదిరాజ్, బుడంపల్లి వెంకటేష్ గౌడ్, కృత దినేష్, క్రాంతి, దుసరి శంకర్ గౌడ్, లావణం శ్రీనివాస్, దుసరి శ్రీకాంత్ గౌడ్, నేమురి లక్ష్మణ్ గౌడ్, సుదర్శన్ సార్, బాలకృష్ణ, సాకేత్ గౌడ్, రమేష్ చౌదరి, చల్లా లక్ష్మణ్, రాజేష్, బగారాం చౌదరి, సోనుచౌదరి, రాజు శర్మ,చల్ల నర్సింహా కేబుల్, నాలచెరువు శ్రీను, చల్లా సత్యనారాయణ, సన్నాయి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ మిత్ర" కార్మికులకు ప్రత్యేక దుస్తుల పంపిణీ




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ పాఠశాల లో పరిశుభ్రత ను పాటించేలా చెట్లను సంరక్షించేలా ప్రత్యేక కార్మికులను ప్రభుత్వం ఇటీవలే ఏర్పాటు చేసింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో వీరు పని చేస్తారు .స్వచ్ఛ మిత్ర గా పేర్కొన్న వీరికి బుధవారం ప్రత్యేక నూతన దుస్తులను కొత్తగూడెం మండల విద్యాధికారి డాక్టర్ .ప్రభుదయాల్ అందజేశారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి దోహదం

* రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి దోహద పడుతుందని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ యువత విద్యతో పటు క్రీడల్లో లో కూడా రాణించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై నైపుణ్యాని పెంచుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా స్కూళ్ల హెడ్ మాస్టర్లు, స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మి నాథ్,విద్యార్థులు పాల్గోన్నారు.

## ఎస్ఆర్ కళాశాల విద్యార్థిని ప్రియాంకకు డీఎస్పీ అభినందన

* విద్యార్థులు కష్టంతో కాదు.. ఇష్టంతో చదువాలి : డీఎస్పీ కె శివరాంరెడ్డి..



ప్రజా స్ఫూర్తి నల్లగొండ : ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో నల్లగొండ ఎస్ ఆర్ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థిని బచ్చు ప్రియాంక ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించగా బుధవారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, కళాశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విద్యార్థినిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరారు. అలాగే కళాశాలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కు సూచనలు చేశారు చదువుకునే సమయంలో ఒత్తిడికి గురి కావొద్దని సూచించారు. ప్రతి సబ్జెక్టును అవగాహన చేసుకొని ప్రిపేర్ అవ్వాలని, భట్టీ విధానానికి స్వస్తి పలుకాలని చెప్పారు. ఆహ్లాకరమైన వాతావరణంలో విద్యనభ్యసించినప్పుడే ఇలాంటి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ ఐ సైదాబాబు, కళాశాల అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు మనోజ్ రెడ్డి, డీన్ కిశోర్ బాబు, ఏఓ సరితారెడ్డి, అధ్యాపకులు వర్ధన్, ప్రసన్న కుమార్, శ్రీనివాస్, శోభ ఉన్నారు.

## నిరుపేదలకు ఉపయోగపడే పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

* కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : నిరుపేదలకు ఉపయోగపడే పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కెపిహెచ్బీ డివిజన్ లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు లు పర్యటించి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ముందుగా ఐదో ఫేస్ వద్ద , మలేషియన్ టౌన్షిప్ ప్రాంతంలో డ్రైనేజ్ సమస్యను ప్రజలు ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు దృష్టికి తీసుకురాగా ఇరుపక్షాల వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని ఏమైనా ఇబ్బందులు ఉన్న ఎడల తనన్ను సంప్రదించాలని తగిన నిధులు కేటాయిస్తామని తెలిపారు. పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.. అనంతరం గత రెండేళ్ల క్రితం 100 పడకల ఆసుపత్రి కొరకు శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని పరిశీలించి నిధులు మంజూరైనా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే ఆసుపత్రి నిర్మించడం లో జాప్యం వహిస్తున్నారని నిరుపేదలకు ఉపయోగపడే విధంగా ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఆనాటి మంత్రి హరీష్ రావు చేతుల మీదగా ఇక్కడ శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. నేటికి ఒక్క అంగుళం కూడా పని మొదలుపెట్టలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రమ్య గ్రౌండ్ వద్ద పాఠశాల పనులను పర్యవేక్షించారు.. నిరుపేదలకు ఉపయోగపడే పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అలసత్వానికి ఉదాహరణే ఈ పాఠశాల నిర్మాణ జాప్యం అని ఆవేదన వ్యక్తం చేశారు.. హౌసింగ్ బోర్డ్ నుంచి ఎటువంటి అభ్యంతరం లేకపోయినా పనులు చేపట్టడానికి.. ప్రభుత్వం, కలెక్టర్ ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని వేడుకున్నారు.. అనంతరం వార్డ్ ఆఫీసు నందు నిర్వహించిన అసోసియేషన్ సభ్యులు, అధికారుల సమీక్ష సమావేశంలో అసోసియేషన్ సభ్యులు అందించిన వినతి పత్రాలను స్వీకరించి ఎక్కడికక్కడ ప్రజలకు ఇబ్బంది లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇప్పటికే కేపీహెచ్బీ డివిజన్లో అనేక పార్కులు నిర్మించుకున్నామని కొన్ని నిర్వహణ లోపం వల్ల ఓపెన్ జిమ్ము, చిన్నపిల్లలు ఆడుకునే పరికరాలు దెబ్బతిన్నాయని అవి ఎందుకు ప్రత్యక్షంగా వెళ్లి పరిశీలించడం లేదని వాటిని కాపాడాలని అధికారులకు సూచించారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధక్షులు కృష్ణారెడ్డి, రాజేష్ అన్ని విభాగాల అధికారులు, అసోసియేషన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

## పన్నుల వసూళ్లలో వేధింపులకు పాల్పడొద్దు : సీఎం చంద్రబాబు

అమరావతి: పన్నుల వసూళ్లలో అవగాహన కల్పించాలని, వేధింపులకు పాల్పడవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. వెలగపూడి లోని సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై సీఎం సమీక్ష నిర్వహించారు. వ్యవస్థలో లొసుగులు వాడుకొని రెవెన్యూకు గండి కొడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల సేవలు యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలన్నారు. ఆదాయార్జనకు కొత్త మార్గాలు అన్వేషించాలని ఆదేశించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

# కంపుకొడుతున్న కుషాయిగూడ వార్డు ఆఫీస్ కార్యాలయం

ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా సర్కిల్ కుషాయిగూడ వార్డు ఆఫీస్ కార్యాలయంలో కంపుకొడుతున్న మూత్రశాలలు, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్వహణ, శుభ్రత లేక మలమూత్రాలతో భరించలేని వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం వార్డు ఆఫీస్ కు వచ్చే ప్రజలు, మహిళలు మూత్రశాలలు, మలవిసర్జనకు వెళ్లామంటే దుర్గంధంతో కంపుకొడుతున్న ఆ పరిసరాలను చూసి మూత్రశాలకు వెళ్ళలేక నానావస్థలు పడుతున్నారు. వర్షాకాలం సీజన్, ఇలాంటి అపరిశుభ్ర వాతావరణంతో రకరకాల వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే పట్టించుకుని మూత్రశాలలు బాగుచేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు






## ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలి

* **జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరి గుట్ట, ప్రజాస్ఫూర్తి : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని రింగుబస్తీ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిర్వహించిన బడిబాట అక్షర అభ్యాసం కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల, ఉపాధ్యాయులు రేఖ, సుష్మ, జితేందర్, షణ్ముఖ నాయకులు పాపయ్య గౌడ్. మల్లారెడ్డి, సిహెచ్. మహేందర్ రెడ్డి హనుమంతు. యాదగిరి. వెంకటేష్ .బసవేశ్వర్. సంపత్ రెడ్డి. సిద్ధులు. శాంతి. ఝాన్సీ. తదితరులు పాల్గొన్నారు

## బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలి

* **బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. బోనాల పండుగ ఉత్సవాల ఏర్పాట్ల నిధులకోసం దరఖాస్తుల స్వీకరణపై ఆయన మాట్లాడుతూ తెలంగాణలో విశేషమైన ఆధ్యాత్మిక ఉత్సవంగా బోనాల పండుగను ప్రతి ఏటా ప్రజలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి ఆలయాలకు నిధులు మంజూరు చేస్తోందని ఆయన తెలిపారు. అర్హత (రిజిస్ట్రేషన్) కలిగిన ఆలయ కమిటీలకు నిధుల కోసం దరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోగా చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు కమిటీ లెటర్‌ప్యాడ్, బ్యాంక్ ఖాతా వివరాలు, సభ్యుల ఆధార్ కార్డు ప్రతులు, ఆలయానికి సంబంధించిన 3 ఫొటోలు. ప్రతీ కాపీ పై కమిటీ స్టాంపు ముద్రించి జతపరచాలని సూచించారు. జూన్ 25వ తేదిలోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

## మంత్రి గడ్డం వివేక వెంకటస్వామి కి శుభాకాంక్షలు



హైదరాబాద్ , (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్ర కార్మిక , మైనింగ్ శాఖ నూతన మంత్రిగా పదవి బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా బుధవారం హైదరాబాదులోని సెక్రటేరియట్లో మంత్రి గడ్డం వివేక వెంకటస్వామి ని ఆల్ ఇండియా ఐఎన్టీయూసీ సీనియర్ సెక్రటరీ , స్టేట్ వైస్ ప్రెసిడెంట్ , సీనియర్ కార్మిక నాయకుడు బాబర్ సలీం పాషా నేతృత్వంలో రాష్ట్ర ఐఎన్టియుసి పక్షాన కలసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఆల్ ఇండియా ఐ ఎన్ టి యు సి , తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి , నేషనల్ ఐఎన్టీయూసీ సెక్రటరీ , మున్సిపల్ సహకార్ సాంగ్ జంట నగరాల అధ్యక్షులు ఆదిల్ షరీఫ్ , తెలంగాణ స్టేట్ ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ యాదవ్ , తెలంగాణ స్టేట్ ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ నాగన్న గౌడ్ , తెలంగాణ స్టేట్ ఐఎన్టీయూసీ సెక్రెటరీ , పెద్దపల్లి జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు శ్రీ భూముల చందర్ , తదితర రాష్ట్రస్థాయి ఐఎన్టియుసి నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు విభాగిని పనులు నాణ్యత ప్రమాణాలు తో చేపట్టాలి

* **శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : రోడ్డు విభాగిని పనులు నాణ్యత ప్రమాణాలు తో చేపట్టాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్, డీసీ గంగాధర్, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్ , పారిశుధ్య విభాగం అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజుల రామరం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగిందన్నారు. యుద్ధప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. 100 ఫీట్ రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యల పై చర్చించి, ప్రణాళిక ను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు.. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని , నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ఉష ముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తి వరకు ఎల్లమ్మ బండ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన గల విద్యుత్ స్థంబాలను స్థాన భ్రంశం చర్యలను వెంటనే చేపట్టాలని, రోడ్డు డివైడర్ మధ్యలో సుందరికరణ పనులు చేపట్టాలని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానార్ గణపతి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈఈ గోవర్ధన్, ఎఈ రాజీవ్, ఎఈ శ్రావణి, ఎఈ నిఖిల్, వర్క్ ఇన్స్పెక్టర్లు మహాదేవ్, రవి కుమార్ , గురువా రెడ్డి, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులు డీఈ జనప్రియ, ఎఈ దయ నంద్, ఎడీఈ లైన్స్ మధుకర్ ,ఎఈ కరణ్ కుమార్, స్ట్రీట్ లైట్స్ డీఈ స్వప్న ఎఎంఓహెచ్ శ్రీనివాస్ ,ఎస్ఆర్పీ నాయక్, నాయకులు ,కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులున్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కాప్రా: మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని నరసింహనగర్ కాలనీలలో 7.50 లక్షల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ఉప్పల్ నియోజకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తీ స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని అలాగే డివిజన్ అభివృద్ధి విషయంలో సహకారం అందిస్తున్న ఎమ్మెల్యేకి మరియు డివిజన్ నాయకులకు కార్పొరేటర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స ఏఈ వేణుగోపాల్, కాలనీ ప్రెసిడెంట్ అరుణ్, రంగు ప్రసాద్, భానురి రాకేష్, విక్రమ్, వేణు గౌడ్, రామానుజం, మనీష్, శ్యామ్, ఐలవేని రాజు, వాసుచారి, నరసింహ గౌడ్, సాయి గౌడ్, సతీష్, వెంకటేష్ మరియు బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, నవీన్ రెడ్డి మరియు కాలనీ నాయకులు పాల్గొన్నారు.

## నూతన పరిశ్రమలు నెలకొల్పుతున్న నైపుణ్యం గల యువ పారిశ్రామిక వేత్తలకు ఋణాలు అందిస్తాం

* **బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ మనోజ్ శ్రీ వాత్సవ**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి): తయారీ రంగంలో, సర్వీసు రంగంలో నూతన పరిశ్రమలు నెలకొల్పుతున్న,నైపుణ్యం గల యువ పారిశ్రామిక వేత్తలకు ఋణాలు అంధిస్తామని బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ మనొజ్ శ్రీ వాత్సవ అన్నారు. తెలంగాణ జోనల్ బ్యాంక్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల వృద్ధికి పారిశ్రామిక వేత్తలకు వ్యాపార అవగహన సదస్సు బాలానగర్ బ్రాంచ్ ఆఫీస్ లొ బుధవారం సాయంత్రం మేనేజర్ అరుణ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి జనరల్ మేనేజర్ మనొజ్ శ్రీ వాత్సవ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భముగా ప్రముఖ పారిశ్రామిక వేత్త లక్ష్మి కోణార్క్ అదినేత సత్యనారాయణ, పారిశ్రామిక ప్రతినిధి మనసా టూల్ టెక్ అదినేత ప్రముఖ కవి వాకిటి రామ్ రెడ్డి,యువ నేత దామోదర్ రెడ్డి తదితరులు తొలిసారిగా విచ్చేసిన జనరల్ మేనేజర్ కు పుష్పగుచ్ఛెమ్ అందించి శాలువతో ఘణంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భముగా జనరల్ మేనేజర్ మాట్లడుతూ ,రెపోరేటు తగ్గినందున మా బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడ వడ్డీరేట్లు తగ్గినవి అని, ముద్రా లోన్స్ , ఎడ్యుకేషన్ లోన్స్ తక్కువ వడ్డీకే ఇస్తున్నామన్నారు. బాలానగర్ బ్రాంచ్ ఏర్పడి దాదాపు యాభై సంవత్సరములు కావస్తున్నదని వినియోగదారుల సహకారంతో గొప్ప పురొగతి సాధిస్తూ మా బ్యాంక్ నుండి ఋణాలు పొందుతూ పారిశ్రామిక స్థలాలు తీసుకుంటున్నారని తెలిపారు .ఈ సందర్భముగా మేనేజర్ అరుణ్ కుమార్ మాట్లడుతూ ,గృహ, ముద్ర ఋణాలు తక్కువ వడ్డీ రేట్లకి ఇస్తున్నామని ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు మా బ్యాంక్ నుండి ఋణాలు అందిస్తున్నామని ముఖ్యంగా నైపుణ్యం గల నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కొరారు. రెండువేల రూపాయల పాలసీతో ఇరువై లక్షల డెత్ ఇన్సురెన్సు పాలసీ అందిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమములో బ్యాంక్ సిబ్బంది సుధాకర్,సావిత్రి, సునీత ,సుధా ,అపర్ణ రమా ,విశ్రాంతి బ్యాంక్ మేనేజర్ అక్కులప్ప సుబాష్ ,మురళి ,మైకేల్ ,సాగర్, కార్తిక్ , రమేష్ ,మణి , ఫిరోజ్ , పారిశ్రామిక వేత్తలు పనిరుద్ ,జంగయ్య తదితరులు పాల్గొన్నారు .

## దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేత



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) :జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి శిరిడి హిల్స్ నందు హెల్పింగ్ హార్డ్ సొసైటీ అధ్యక్షులు తుటే విజయ్ కుమార్ ఆధ్వర్యంలో భాగ్యలక్ష్మి ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ మాణిక్ చారి 50వ జన్మదిన వేడుకలు బుధవారం దివ్యాంగుల మధ్యలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ , యండి.నన్నే మియా పాల్గొని దివ్యాంగులకు పది మందికి నిత్యవసర సరుకులు మానసిక వికలాంగునికి రెండు నెలలు సరిపడ్డ డైపర్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికలాంగులకి తన వంతు సహాయం మునుముందు ఏమన్నా ఉంటే చేస్తామన్నారు దివ్యాంగుల మధ్యలో జన్మదిన జరుపుకోవడం ఆనందంగా ఉందని మాణిక్ చారి తెలిపారు. ఈ కార్యక్రమాలో డాక్టర్ సత్యనారాయణ. భాగ్యలక్ష్మి పౌండేషన్ అధ్యక్షులు భాగ్యలక్ష్మి అశోక సంఘం అధ్యక్షులు. ఎసు బాబు మదర్ తెరిసా ఫౌండేషన్. అధ్యక్షులు శ్రావణ్ కుమార్ . రమ విజయ శంకర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పీర్ల కొట్టం ను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేకు వినతి



మల్కాజ్గిరి ,ప్రజాస్ఫూర్తి : ఓల్డ్ నేరేడుమెట్ లోని అతి పురాతనమైన పీర్ల కొట్టం ను అభివృద్ధి చేయాలని బుధవారం మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో మల్కాజ్గిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖరరెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముహర్రం సంతాపం దినాల /పీర్ల పండుగ నిర్వహణ కొరకు సీసీ రోడ్ నిర్మాణం కొరకు నిధుల కేటాయించాలన్నారు.దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను తగినంత త్వరగా పరిష్కారం చేస్తాము అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దాచబోయిన సాయినాథ్, పులిమామిడి రమేష్, షేక్ జావేద్,మొహమ్మద్ తబ్రీజ్, మొహమ్మద్ మోయిజ్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ వెంకటస్వామికి శుభాకాంక్షలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) :తెలంగాణ రాష్ట్ర మైన్స్ , కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గడ్డం వివేక్ వెంకటస్వామి కి రాష్ట్ర కాంగ్రెస్ నేత ఉనుకొండ శ్రీధర్ పటేల్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ పటేల్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా కృషి చేస్తానని, వాటిని మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నా వంతు బాధ్యతను నెరవేర్చుతానని తెలిపారు. కార్మికుల సంక్షేమమే తన ప్రాధాన్యతగా పేర్కొన్నారు.

* **అక్రమ షెడ్ పై చర్యలేవి?:**
* **తీరు మారని టౌన్ ప్లానింగ్ అధికారులు!:**
* **నాయకుల పేర్లు చెబితే అనుమతి వద్దా?:**
* **అధికారులూ.... అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి**

# నీకింత..... నాకింత!









ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :అధికారులు మారుతున్నారు.... సిబ్బంది సస్పెండ్ అవుతున్నారు... అయినా గాజుల రామారం సర్కిల్ లో అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. ప్రధానంగా గాజుల రామారం డివిజన్ లో కొందరు వ్యక్తుల అండతో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.ప్రభుత్వ నిబంధనల సంగతి దేవుడెరుగు కానీ మాకు ఆమ్యామ్యాలు అందితే చాలు అన్నట్టుగా టౌన్ ప్లానింగ్ అధికారులు పని చేస్తుండటంతో ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాల పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. డివిజన్ పరిధిలోని మహాదేవ పురం చౌరస్తా దగ్గర ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ షెడ్ నిర్మాణ పనులు జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రధాన రహదారి లో పది రోజులకు పైగా భారీ షెడ్ నిర్మాణ పనులు జరుగుతున్నా గాజుల రామారం టౌన్ ప్లానింగ్ అధికారులు చూసిచూడనట్టుగా వదిలేస్తున్నారు. దీంతో అధికారులకు ఎవరి వాటాలు వారికి అందినట్టే వున్నాయి అని స్థానికులు చర్చించుకుంటున్నారు! టీపీఓ బాధ్యతలు చేపట్టినట్టేనా?:గాజుల రామారం సర్కిల్ లో పని చేసిన సెక్షన్ అధికారి బదిలీపై వెళ్లగా అతని స్థానంలో ఇటీవలే ఓ అధికారి బాధ్యతలు చేపట్టాడు.గతంలో ఈ ప్రాంతంలో విధులు నిర్వహించిన టౌన్ ప్లానింగ్ అధికారిపై అవినీతి ఆరోపణలు మిన్నంటిన తరుణంలో అతని స్థానంలో వచ్చిన అధికారి ఏ విధంగా పనిచేస్తాడోనని స్థానికులు అతడి పనితీరు పై ఓ కన్నేసి ఉంచారు.గాజులరామారం సెక్షన్ అధికారి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి కార్యాలయానికే పరిమితం అవుతుండటం ఇంకా సర్కిల్ పరిధిపై పూర్తి స్థాయి అవగాహన రాకపోవడంతో స్థానిక నాయకులు చెప్పినట్టుగా పని చేస్తున్నాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇంత నిర్లక్ష్యమా?: వేలాది రూపాయల ప్రభుత్వ జీతం తీసుకుంటున్న జీహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు నామమాత్రంగా కార్యాలయానికే పరిమితం అవుతున్నారు! నిర్మాణదారులు నిబంధనలు భేఖాతరు చేస్తూ, ప్రభుత్వ ఆదాయనికి గండి కొడుతున్నా అధికారులు చోద్యం చూడటం విమర్శలకు తావిస్తుంది.ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి మహాదేవపురం చౌరస్తా సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న షెడ్ పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## విమానం కూలిన చోట 70 తులాల బంగారం సేకరించి.. మానవత్వం చాటి..!



అహ్మదాబాద్: ఇటీవల అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటన అంతులేని విషాదం నింపింది. ఈ దుర్ఘటనలో 270మందికి పైగా మరణించడం ప్రతిఒక్కరినీ కలచివేసింది. ఈ విషాద సమయంలో సత్వరమే స్పందించి మానవత్వాన్ని చాటుకున్న వ్యక్తుల్లో రాజేశ్ పటేల్ ఒకరు. విమానం కుప్పకూలిన విషయం తెలియగానే హుటాహుటిన ఘటనా స్థలానికి పరుగెత్తిన ఆయన.. మృతదేహాలు, క్షతగాత్రులను అంబులెన్సుల్లోకి ఎక్కించడంలో ఎంతగానో కృషిచేశారు. సహాయక చర్యల అనంతరం ఘటనా స్థలం వద్ద పొగలు కక్కుతున్న శిథిలాల్లో వెతికి మరీ.. దాదాపు 70 తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు, కొన్ని అమెరికా డాలర్లు సేకరించి పోలీసులకు అప్పగించడం ద్వారా తన నిజాయతీని సైతం చాటుకున్నారు.

* **తొలి 20 నిమిషాలు దగ్గరికి వెళ్లలేకపోయాం..**

నిర్మాణ రంగంలో వ్యాపారిగా ఉన్న రాజేశ్ పటేల్.. ఈ దుర్ఘటన అనంతరం అక్కడ నెలకొన్న పరిస్థితులను వివరించారు. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కూలగానే ఒక్కసారిగా శబ్దం వచ్చి.. ఆకాశంలోకి ఓ పెద్ద అగ్నిగోళంలా ఎగసిపడిందన్నారు. అప్పుడు తాను ఘటనా స్థలానికి కేవలం 300 మీటర్ల దూరంలోనే ఉన్నట్లు తెలిపారు. బీజే వైద్య కళాశాల హాస్టల్ కాంప్లెక్స్‌పై విమానం కూలిందని తెలిసిన వెంటనే వీలైనంత ఎక్కువ మందిని కాపాడాలనే ఆశతో ఆ ప్రాంతానికి పరుగెత్తినట్లు చెప్పారు. కానీ, తొలి 15 నుంచి 20 నిమిషాల వరకు ఘటనా స్థలికి దగ్గరగా తాము వెళ్లలేకపోయామన్నారు. మంటలు అదుపులోకి వచ్చిన తర్వాతే సహాయక చర్యలు ప్రారంభించగలిగినట్లు వెల్లడించారు.

* **పాత చీరలతోనే మృతదేహాల తరలింపు..**

''మాకు అందుబాటులో స్ట్రెచర్లు లేవు. దీంతో పాత చీరలు, బెడ్‌షీట్లు, గన్నీ బ్యాగుల్లోనే మృతదేహాలు, క్షతగాత్రులను అంబులెన్సుల్లోకి ఎక్కించాం'' అని వివ రించారు. సహాయక చర్యలు పూర్తయిన తర్వాత ప్రయాణికులకు సంబంధించిన వస్తువులను సంరక్షించే పనిలో నిమగ్నమైన అతడికి ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న 10 15 హ్యాండ్ బ్యాగ్‌లు కాలి పోయిన స్థితిలో లభ్యమయ్యాయి. ''వీటిలో 70 తులాల బంగారు ఆభరణాలు, 810 వెండి వస్తువులు, కొన్ని పాస్‌పోర్టులు, భగవద్గీత పుస్తకం, రూ.50వేల నగదు, 20 డాలర్లు ఉన్నాయి. వాటిని మేం రెస్క్యూ ఆపరేషన్ పర్యవేక్షిస్తున్న పోలీస్ అధికారికి అప్పగించాం'' అని తెలిపారు. గతంలో ఫొటో గ్రాఫర్‌గా పనిచేసిన పటేల్.. 2008లో అహ్మదాబాద్ వరుస పేలుళ్ల తర్వాత అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రిలో వాలంటీర్‌గా పనిచేశారు. ఆస్పత్రి ట్రామా సెంటర్‌లో జరిగిన పేలుడులో తన ఇద్దరు సన్నిహితులను కోల్పోయారట.

* **ప్రతి వస్తువునూ అప్పగిస్తాం: పోలీసులు**

మరోవైపు, విమాన దుర్ఘటన జరిగిన ప్రదేశం నుంచి స్వాధీనం చేసుకున్న ప్రతి విలువైన వస్తువును మృతుల బంధువులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఒక జాబితాను తయారు చేసి ఎయిరిండియాతో సమ న్వయం చేసుకొని అందించే ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు.

# అనుమతులు లేకుండానే.. అంబిటస్..?

- **పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, పాఠశాల యూనిఫామ్ అమ్మకాలు**
- **అడ్మిషన్ కు రూ.5వేలు**
- **ఎల్ కే జీ కి రూ.52వేలు**










చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వం అందరికీ విద్యను అందించడం లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పింది.. ఒకప్పుడు పేదలు, ధనికులనే తేడా లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసించారు. కాలానుగుణంగా ఆయా ప్రాంతాలలో ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థలు పుట్టుకొచ్చాయి. ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆకర్షితులయ్యారు. దీంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు డబ్బుతో పాటు పేరును కూడా సంపాదించాయి. ఆ లాభాలను చూసిన బడా వ్యాపారవేత్తలు కార్పొరేట్ పాఠశాలలను, విద్యాసంస్థలను నెలకొల్పారు. నిరుపేదలకు అందని ద్రాక్షలా.. విద్య వ్యాపారంగా మారింది.

### చౌటుప్పల్ పై కార్పొరేట్ కన్ను..

హైదరాబాద్ కు అతి సమీపంలో, జాతీయ రహదారి 65 వెంట ఉన్న చౌటుప్పల్ పై కార్పొరేట్ విద్యాసంస్థల కన్ను పడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన కార్పోరేట్ విద్యాసంస్థలు గత సంవత్సరం నుంచి వరుసగా తమ విద్యాసంస్థలను చౌటుప్పల్ లో నెలకొల్పడం ప్రారంభించారు.

### అనుమతులు లేకుండానే.. అంబిటస్

విద్యాసంస్థ నెలకొల్పేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నియమ నిబంధనలకు లోబడి విద్యాసంస్థను ఏర్పాటు చేయాలి. కానీ, అవసరమైన అనుమతులు లేకుండానే చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో గత సంవత్సరం అంబిటస్ విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. నిబంధనలో తుంగలో తొక్కి, డబ్బే లక్ష్యంగా విద్యాసంస్థను నడిపిస్తున్నారు. చౌటుప్పల్ మండల వ్యాప్తంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అంబిటస్ లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం నుంచి ఎటువంటి గుర్తింపు లేకపోవడంతో పాటు అనుమతులు లేని భవనంలో విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి భవనాన్ని మార్చాలని ఉత్తర్వులు జారీ చేశారు. అడ్మిషన్లు చేయవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నా, ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ, అదే భవనంలో విద్యా సంస్థను నిర్వహిస్తూ, అడ్మిషన్లను ప్రారంభించారు.

### పాఠశాలలోనే.. స్టేషనరీ

జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి విద్యాశాఖ అధికారి పాఠశాలలో సొంతంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, పాఠశాల యూనిఫామ్ అమ్మకాలు చేయవద్దని నిబంధనను అంబిటస్ తుంగలో తొక్కింది. అంబిటస్ పాఠశాల లోపల పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, పాఠశాల యూనిఫామ్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల ఓ విద్యార్థి సంఘం నాయకులు ఈ అమ్మకాలను పట్టుకొని మండల విద్యాశాఖ అధికారికి సమాచారం ఇచ్చారు. దీంతో సంబంధిత మండల విద్య శాఖ అధికారులు వచ్చి, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, పాఠశాల యూనిఫామ్ లు ఉన్న గదికి తాళాలు వేసుకొని వెళ్లారు. ఏమైందో తెలియదు కానీ, పాఠశాల లోపల స్టేషనరీ వ్యాపారం మళ్లీ ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా డబ్బులను వసూలు చేస్తూ, పుస్తకాలు, యూనిఫామ్ లను అంటగడుతున్నారు.

### అడ్మిషన్ కు రూ.5వేలు

పాఠశాలకు ఎటువంటి గుర్తింపు లేకున్నా అడ్మిషన్ ఫీజు తరగతులకు అనుగుణంగా రూ.5వేల నుంచి రూ.10వేలు వసూలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ నుంచి 7వ తరగతి వరకు మాత్రమే నిర్వహించేందుకు ప్రభుత్వం పాఠశాల ప్రారంభ అనుమతిచ్చింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి గుర్తింపు లేదు. అనుమతులతో సంబంధం లేకుండా 9వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రీ ప్రైమరీ నుంచి అన్ని తరగతులకు అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఒక్కో తరగతి అడ్మిషన్ కు ఒక్కో ధరను నిర్ణయించారు. తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, దొరికినంత దోచుకుంటున్నారు. అడ్మిషన్ ఫీజు కట్టిన తర్వాత, మరొక పాఠశాలకు మారకుండా విద్యార్థులను కట్టడి చేస్తున్నారు. ఈ పాఠశాలకు ఎందుకొచ్చామా అని విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు.

### ఎల్ కే జీ కి రూ.52వేలు

అంబిటస్ పాఠశాలలో ఒక్కో తరగతికి ఎంత ఫీజు నిర్ణయించారనే విషయం యాజమాన్యానికి మాత్రమే తెలియాలి. పాఠశాలలో ఒక తరగతికి ఎంత ఫీజు అని నిర్ణయించిన ఎలాంటి నోటీసు బోర్డు ఏర్పాటు చేయలేదు. విద్యార్థుల తల్లిదండ్రులతో స్వయంగా మాట్లాడి ఫీజును నిర్ణయిస్తున్నారు. ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేయాలని నిర్ణయించలేదని సమాచారం. ఎల్ కే జీ కి మాత్రమే రూ.52వేలు వసూలు చేస్తున్నారు. మిగతా తరగతులకు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ఊహించవచ్చు.

## 'ఆర్థిక వ్యవస్థకు విఘాతం'..
# దొంగనోట్ల నిందితుడికి బెయిల్ నిరాకరణ

దిల్లీ: నకిలీ కరెన్సీ నోట్ల రాకెట్‌లో అరెస్టైన విదేశీయుడికి సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అతడు పాల్పడిన చర్యలను ఆర్థిక వ్యవస్థకు విఘాతంగా పేర్కొంది. ఇలాంటి వ్యక్తికి బెయిల్ మంజూరు చేయడం మంచిది కాదని వ్యాఖ్యానించింది. బల్గేరియాకు చెందిన రుస్లన్ పెట్రోవ్ మెతోదివ్ మనదేశంలో నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించేవాడు. ఈ రాకెట్ వెలుగులోకి రావడంతో 2023లో దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.8 లక్షల విలువ గల రూ.500 నకిలీ నోట్లు, వాటిని తయారు చేసే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితుడు దిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయగా.. కోర్టు తిరస్కరించింది. దీంతో రుస్లన్ పెట్రోవ్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. దీనిపై తాజాగా న్యాయస్థానం విచారణ చేపట్టింది. ''ఇలాంటి చర్యలు ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలిగిస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు. రూ.8 లక్షల నకిలీ డబ్బుతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యక్తిపై నేరారోపణలు చాలా బలంగా ఉన్నాయి. నేరం రుజువై దోషిగా తేలితే దీర్ఘకాలిక శిక్ష విధించే అవకాశం ఉంది. ఇలాంటి నేరానికి పాల్పడిన వ్యక్తికి బెయిల్ మంజూరు చేస్తే.. అతడు పరారయ్యే అవకాశం లేకపోలేదు. అతడి అభ్యర్థనను మన్నించడం ఆమోదయోగ్యం కాదు'' అని సుప్రీం కోర్టు పేర్కొంది.

## జులై 9న నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలి

* **సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కార్మికుల శ్రమను దోపిడీ చేసే 4 లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా జులై 9న తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్ పీలువునిచ్చారు. బుధవారం ఉదయం సిఐటియు షాపూర్ నగర్ కార్యాలయంలో జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంత లోడింగ్ అన్లోడింగ్ హమాలీ యూనియన్ కార్మికులతో కలిసి సమ్మె కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత బ్రిటిష్ కాలం లో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడులను తేవడం వల్ల కార్మిక హక్కులను హరించి వేస్తున్నారని అన్నారు. ఈ రోజు దేశం లో ఎగుమతి దిగుమతి చేస్తున్న హమాలీ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలన్నారు. హమాలీ కార్మికులకు ఆరోగ్య బీమా, పని భద్రత , ప్రమాద బీమా పథకాలను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాల వల్ల 29 కార్మిక చట్టాలను పార్లమెంటు సాక్షిగా కార్మికులు కోల్పోయారనీ,1991 లో తెచ్చిన నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ నేడు బీజేపీ ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ శక్తులకు ఆదాని అంబానీలకు ప్రభుత్వ రంగాన్ని గంపగుత్తగా అమ్మివేస్తూ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా నల్ల చట్టాలు తెచ్చి కార్మికుల శ్రమని దోపిడి చేసే చట్టాలకు వ్యతిరేకంగా జులై 9వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో 10 కేంద్ర కార్మిక సంఘాల, ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు పాల్గొంటున్నాయన్నారు. ప్రతీ ఉద్యోగ, కార్మికులు, స్కీమ్ వర్కర్లు అసంగిటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంత హమాలీ సంఘం నాయకులు కే శీను, కరుణాకర్ మల్లారెడ్డి, పాషా, నర్సింలు, యాదవరెడ్డి, సాధులు, కనకయ్య, శ్రీశైలం, వీరేష్, తిమ్మప్ప, దుర్గా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# శవ రాజకీయాలు చేయడంలో జగన్ దిట్ట



విశాఖపట్నం: వైకాపా అధినేత జగన్.. ఈ సంవత్సరం కాలంలో చంపడం, పరామర్శ చేయడమే అజెండాగా పెట్టుకున్నారని ఏపీ హోంమంత్రి అనిత వ్యాఖ్యానించారు. పల్నాడు జిల్లాలో జగన్ పర్యటనపై ఆమె విశాఖలో స్పందించారు. నేరస్తుడు రాజకీయ ముసుగులో ఉంటే ఎలా ఉంటుందో కళ్లారా చూస్తున్నామన్నారు. గతేడాది జూన్‌లో నాగమల్లేశ్వరరావు చనిపోతే ఇప్పుడు వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శిస్తున్నారని విమర్శించారు. బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని ఆయన ఆత్మహత్య చేసుకుంటే ఆ నేరం పోలీసులపై వేశారని ఆక్షేపించారు. ''జడ్ కేటగిరి భద్రత ఉన్న వ్యక్తి పర్యటనకు ఏడు రోజుల ముందు అనుమతులు తీసుకోవాలి. భద్రతపరంగా పోలీసులు వైకాపా నాయకులకు పలు సూచనలు చేశారు. జగన్ పర్యటనలో రెచ్చగొట్టే విధంగా ఫ్లెక్సీలు పెట్టారు. ర్యాలీలో జగన్ కాన్వాయ్ ఢీకొని వైకాపా కార్యకర్త సింగయ్య మృతి చెందితే కనీసం స్పందించలేదు. పోలీసులు చూసి ఆస్పత్రికి తరలించారు. జగన్ సైకో అనడానికి ఈ పనులే నిదర్శనం. బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించిన ఏకైక వ్యక్తి జగన్.

# పేదరిక నిర్మూలనకు 'తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి'



పేదరిక నిర్మూలన లక్ష్యంగా తెలంగాణ సమ్మిళిత జీవనోపాధిని ప్రారంభిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. అత్యంత వెనకబడిన 6 వేల కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వం ద్వారా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అభాగ్యులు, నిర్భాగ్యులకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం తరుపున ఆయా కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి కార్యక్రమం(తెలంగాణ ఇన్‌క్లూసివ్ లైవ్లీహుడ్స్‌ప్రొగ్రామ్‌టీజీఐఎల్పీ)పై సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యంత వెనకబడిన కుటుంబాలను, వర్గాలకు ఆర్థిక పథంలో నిలిపేలా సమ్మిళిత జీవనోపాధి కృషి చేస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రెండేళ్లపాటు ఆయా కుటుంబాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆదిమ జాతులు అంతరిస్తున్నాయని, వాటి పరిరక్షణ కోసం బ్రాక్ సంస్థతో కలిసి పనిచేస్తామన్నారు. ఆదిమ జాతుల ఆర్థిక ప్రగతిపై ప్రధానంగా దృష్టి సారిస్తామని చెప్పారు. సమగ్ర ఉపాధి అవకాశాల ద్వారా పేదల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి సుస్థిరాభివృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని మంత్రి అన్నారు. తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి పథకంలో భాగస్వాములుగా ఉన్నా బ్రాక్ ఇంటర్నేషల్, ఆఘా ఖాన్ ఫౌండేషన్, సెంటర్ ఫర్ రిసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్, ప్రధాన్, ట్రికిల్ అప్ సంస్థలకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని చెంచుపేటలో పర్యటించి చెంచుల జీవన స్థితిగతులను తెలుసుకున్న స్మితి శరణ్ ను మంత్రి సీతక్క శాలువ కప్పి సన్మానించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ స్మితి శరణ్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, బ్రాక్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**: ఎఫ్ఏటీహెచ్ఐ ఛైర్మన్**

హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు హైదరాబాద్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఫార్మా, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల ప్రతినిధులు సమావేశమయ్యారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ. 8వేల కోట్లకుపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వారు చర్చించారు అనంతరం ఫెడరేషన్ ఛైర్మన్ రమేష్ బాబు మీడియాతో మాట్లాడారు. "2022 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే టోకెన్లు విడుదల చేసిన రూ. 2వేల కోట్లను ఈ నెలాఖరు నాటికి విడుదల చేయాలి. దాదాపు మూడు సంవత్సరాలుగా ఫీజు బకాయిలు రాకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఫలితంగా విద్యా ప్రమాణాల నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించి ప్రతి మూడు నెలలకు ఒకసారి బకాయిలు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి" అని కోరారు.

## బనకచర్ల ప్రాజెక్టును ఆపిన తర్వాతే రేవంత్ రెడ్డి ఢిల్లీ నుంచి వెనక్కు రావాలి

**: కవిత**

హైదరాబాద్: గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఎంపీలతో సమావేశంతో ఫలితం ఉండదని.. ఢిల్లీలో ముఖ్యమంత్రి పోరాటం చేస్తేనే ఫలితం ఉంటుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, భారాస ఎమ్మెల్సీ కవిత అన్నారు. సముద్రంలోకి వెళ్లే వృథా జలాలను ఉపయోగించుకోవాలని నాడు చెప్పిన కేసీఆర్.. నదుల అనుసంధానానికి తుపాకులగూడెం ఆనకట్టను ఉపయోగించుకోవాలని స్పష్టంగా చెప్పారని తెలిపారు. పోలవరం నుంచి నదుల అనుసంధానాన్ని కేసీఆర్ ఏనాడు అంగీకరించలేదని అన్నారు.



చంద్రబాబు ఏపీకి నిధుల కోసం ప్రయత్నం చేస్తుంటే.. రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని కవిత మండిపడ్డారు. "రాష్ట్రానికి నష్టం జరుగుతున్నప్పటికీ సీఎం మాట్లాడకపోవడం ద్రోహం. నల్లమల్ల పులిబిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డి.. చంద్రబాబు జలదోపిడీని నివారించడంలో విఫలమయ్యారు. బొల్లపల్లి జలాశయంతో నల్లమల్ల అడవి కూడా ముంపునకు గురవుతుంది. దీన్ని జాగృతి తరఫున ఉద్యమించి అడ్డుకుంటాం. బొల్లపల్లి జలాశయ నిర్మాణానికి వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టి బనకచర్ల ప్రాజెక్టును ఆపిన తర్వాతే రేవంత్ రెడ్డి ఢిల్లీ నుంచి వెనక్కు రావాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే వందల కొద్దీ నామినేషన్లు వేయించి ఎన్నికల ప్రక్రియలో సత్తా చాటుతాం. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రధానినిసీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేయాలి. బీసీ రిజర్వేషన్లు ఇవ్వకుండా భాజపా వికసిత్ యాత్రలతో లాభం ఉండదు. జూలై 17న రైల్ రోకో చేపడతాం. ఆ సమయాల్లో రైల్ ప్రయాణాలు ఉంటే ప్రజలు వాయిదా వేసుకోవాలి" అని కవిత సూచించారు.

## మూడో రోజు.. 4 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు

**: మంత్రి తుమ్మల**

హైదరాబాద్: రాష్ట్రంలో రైతుభరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ కొనసాగుతోంది. మూడో రోజు ఇవాళ 4 ఎకరాల విస్తీర్ణం వరకు రైతుభరోసా నిధులు జమ కోసం ప్రభుత్వం మరో రూ.1,313.53 కోట్లు విడుదల చేసింది. మరో 21.89 లక్షల ఎకరాలకు సంబంధించి 6.33 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.5215.26 కోట్లు రైతుభరోసా కోసం విడుదల చేసి 58.04 లక్షల మంది రైతులకు సాయం అందించినట్లైంది. 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా మూడో రోజు రైతుభరోసా నిధులు విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు ఈ సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. రైతుభరోసా విషయంలో భారాస నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదన్నారు. "గతంలో భారాస ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడూ సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయింది. ప్రతిసారి ఆలస్యంగా రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేలకు పెట్టుబడి సహాయం పెంచి రైతులకు అందజేస్తున్నాం. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇవ్వాల్సిన యాసంగి సీజన్ సంబంధించిన రైతుబంధు నిధులు ఇవ్వకుండా గత ప్రభుత్వం వదిలేస్తే.. మేం అధికారంలోకి రాగానే ఆ నిధులు కూడా చెల్లించాం. రైతుల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.77,000 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు



పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. సీఎం ఇచ్చిన హామీ మేరకు వానాకాలం రైతుభరోసా నిధులు జమ చేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా 9 రోజుల్లో రైతుభరోసా సహాయం పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికైనా భారాస నాయకులు ఆత్మ విమర్శ చేసుకుని ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలి. లేదంటే రైతాంగం ఎప్పటికీ క్షమించదు" అని మంత్రి తుమ్మల అన్నారు.

## గర్భిణికి సిజేరియన్.. కడుపులోనే సూది మర్చిపోయిన వైద్యులు

హుజూరాబాద్: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రసవం కోసం వచ్చిన గర్భిణికి వైద్యులు శస్త్రచికిత్స చేసిన సూది మర్చిపోయారు. జమ్మికుంటకు చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం ఆదివారం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి వచ్చింది. దీంతో ఆమెకు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. తల్లిబిడ్డా క్షేమంగానే ఉన్నారు. అయితే, కుట్లు వేసే సూది మహిళ కడుపులో వదిలేశారు. ఆ తర్వాత సూది కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన వైద్యులు సర్జరీ చేసిన మహిళకు వెంటనే ఎక్స్‌రే తీశారు. సూది కడుపులో ఉన్న విషయాన్ని గ్రహించి కుట్లు విప్పి




సూది బయటకి తీశారు. విషయం మూడు రోజుల తర్వాత బయటకు రావడంతో తమ తప్పేమీ లేదని, కుట్లు వేసే సమయంలో సూది కడుపులో పడిపోగా.. వెంటనే ఎక్స్‌రే తీయించి సూదిని బయటకు తీశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి తెలిపారు. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ నిర్లక్ష్యంపై పోరాటానికి సిద్ధం: భారాస

హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ చూపిస్తున్న ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంపై రాష్ట్ర రైతాంగం తరపున పోరాటానికి సిద్ధమవుతున్నట్లు భారాస ప్రకటించింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంపై చర్చించేందుకు పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో త్వరలోనే కీలక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది. పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యే ఈ ఉన్నతస్థాయి సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వం, రైతు వ్యతిరేక వైఖరిపై ప్రధానంగా చర్చిస్తామని భారాస తెలిపింది. భారాస హయాంలో 90శాతం పూర్తి అయిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనపెట్టడంతోపాటు రెండు పిల్లర్లు కుంగాయన్న సాకుతో మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెడుతున్న కాంగ్రెస్ కుట్రలను కేసీఆర్ పార్టీ నాయకులకు




వివరిస్తారని పేర్కొంది. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో లక్షల ఎకరాల్లో రైతులకు సాగునీరు అందకుండా పోతోందని.. రాజకీయ దురుద్దేశంతో అన్నదాతలపై కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించనున్నట్లు భారాస తెలిపింది. సాగునీటి ప్రాజెక్టుల అంశంలో ఉద్యమ కార్యాచరణకు భారాస ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## ఏసీబీకి సెల్‌ఫోన్ అప్పగించాలన్న అంశంపై కేటీఆర్ సమాధానం



హైదరాబాద్: సెల్‌ఫోన్ అప్పగించాలన్న అంశంపై ఏసీబీ నోటీసుకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ లేఖ ద్వారా సమాధానం పంపారు. ఫార్ములాఈ కార్ రేసు కేసులో కేటీఆర్ విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వాలని ఏసీబీ అధికారులు ఆదేశించారు. సెల్‌ఫోన్ స్వాధీనం ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తుందని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. ఏసీబీ అధికారుల ఆదేశాలపై కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చించారు. అనిశా అధికారులు ఆదేశించినట్లుగా మొబైల్ ఫోన్‌ను, ల్యాప్‌టాప్‌ను వారికి ఇవ్వాల్సిన అవసరం లేదని న్యాయవాదులు కేటీఆర్‌కు చెప్పినట్టు సమాచారం.

## ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు..

### నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రికత్తలు కొనసాగుతున్నాయి. యుద్ధ భయాలు నెలకొన్నాయి. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపై ప్రభావం పడింది. అదే సమయంలో మెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయం బుధవారం రాత్రి వెలువడనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 81,314.62 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత సూచీలు లాభాల్లోకి దూసుకెళ్లాయి. కొద్దిసేపటికే మళ్లీ ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ఇంట్రాడేలో 81,858.97 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 81,237.01 పాయింట్లకు చేరింది.

చివరకు 138 పాయింట్ల నష్టంతో 81,444.66 వద్ద ముగిసింది. నిఫ్టీ 41 పాయింట్లు పతనమై 24,812.05 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1486 షేర్లు లాభపడగా.. 2,342 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన వాటిలో టీసీఎస్, అదానీ పోర్ట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌యూఎల్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఉన్నాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, టైటాన్ కంపెనీ, మారుతి సుజుకి, మహీంద్రా అండ్ మహీంద్రా లాభాలను ఆర్జించాయి. రంగాల వారీగా, ఆటో, ప్రైవేట్ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా, అన్ని ఇతర సూచీలు ఐటీ, మీడియా, మెటల్, ఆయిల్, గ్యాస్, రియాల్టీ 0.5-1 శాతం పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.3 శాతం పడిపోయాయి.

## పని చేస్తే సరే.. ఖాళీగా ఉంటే కుదరదు..

### టీసీఎస్ ఉద్యోగులకు కొత్త విధానం




**న్యూఢిల్లీ:** ఏ సంస్థ అయినా ప్రగతి పథంలో పయనించడానికి ఉద్యోగుల పనితీరు చాలా కీలకం. వారందరూ ఆ సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించినప్పుడే ఉన్నత స్థానానికి చేరుకుంటుంది. దీని వల్ల ఆ కంపెనీతో పాటు ఉద్యోగులకు కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుంది. దీనిలో భాగంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగుల కోసం కొత్త పని విధానం తీసుకువచ్చింది. దాని ప్రకారం ప్రతి ఉద్యోగికి ఏడాదికి కనీసం 225 రోజులు క్లయింట్ ప్రాజెక్టుల్లో పనిచేయాలి. గరిష్టంగా 35 రోజులు మాత్రమే బెంచ్ (ప్రాజెక్టు లేని సమయం)లో ఉండవచ్చు. ఈ విధానం జూన్ 12 నుంచి అమల్లోకి వచ్చింది. ఉద్యోగుల ఖాళీ సమయాన్ని తగ్గించి, సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసేలా ప్రోత్సాహించడం దీని ప్రధాన ఉద్దేశం.

ది రిసోర్స్ మెనేజ్ మెంట్ గ్రూప్ (ఆర్ఎంజీ) గ్లోబల్ హెడ్ చంద్రశేఖరన్ రామ్ కుమార్ ఈ కొత్త పని విధానాన్ని రూపొందించారు. టీసీఎస్ లోని శ్రామిక శక్తి విస్తరణను ఆర్ఎంజీ పర్యవేక్షిస్తుంది. ప్రతి ప్రాజెక్టుకు ప్రతిభ కలిగిన వారిని కేటాయించేలా చూస్తుంది. ఉద్యోగులందరికీ అన్ని సమయాల్లో ప్రాజెక్టులు కేటాయిస్తుంది. కొత్త విధానం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఉద్యోగులు ఎక్కువ కాలం బెంచ్ లో ఉంటే జీతం, కెరీర్ గ్రోత్, విదేశీ అవకాశాలు తదితర వాటిపై ప్రతి కూల ప్రభావం పడుతుందన్నారు.

కొత్త నిబంధనల ప్రకారం ప్రాజెక్టు లేని ఉద్యోగులు తమకు తాముగా పని వెతుక్కోవాలి. అంటే బెంచ్ లో ఉన్న ఉద్యోగి తమ యూనిట్ లేదా, రీజినల్ ఆర్ఎంజీని సంప్రదించాలి. సంస్థ అందించే అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా తమ నైపుణ్యాలను పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలి. బెంచ్ లో ఉండే ఉద్యోగులు రోజుకు 4 నుంచి 6 గంటల పాటు టీసీఎస్ ఐఇవాల్వ్, ఫ్రోస్కో ప్లే, వీఎల్ఎస్ వంటి అంతర్గత ప్లాట్ ఫాంలతో పాటు, లింక్డ్ ఇన్ వంటి బయట వాటిని నేర్చుకోవాలి. ఆర్ఎంజీ సిఫారసు చేసిన విధంగా వ్యక్తిగత సెషన్లకు హాజరుకావాలి.

టీసీఎస్ లో పనిచేసే ఉద్యోగులందరూ తప్పనిసరిగా ఆఫీసుకు రావాలని నిబంధనలు చెబుతున్నాయి. వారందరూ ఆఫీసు నుంచి పని చేయాల్సి ఉంటుంది. వర్క్ ఫ్రం హోమ్, ఫ్లెక్సిబుల్ పని ఏర్పాట్లకు అనుమతి ఇవ్వరు. అయితే అత్యవసర సమయలో ఆర్ఎంజీ అనుమతితో తాత్కాలికంగా ఫ్లెక్సిబుల్ పని చేసేలా అవకాశం కల్పిస్తారు. అలాగే ఉద్యోగులు షార్ట్ టర్మ్ ప్రాజెక్టులో ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. తరచూ ఇలాంటి వాటిలో పనిచేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

## లక్షలోపు లక్షణమైన స్కూటర్ రిలీజ్ చేసిన బజాజ్..



**న్యూఢిల్లీ:** భారతదేశంలో ఈవీ స్కూటర్ల హవా రోజురోజుకూ పెరుగుతుంది. పెరుగుతున్న పెట్రోల్ ధరల దెబ్బకు సగటు సామాన్యుడు ఈవీ స్కూటర్లన వాడకానికి మొగ్గు చూపడంతో వాటి డిమాండ్ అమాంతం పెరిగింది. అయితే దేశంలో ఉన్న మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకునేలా చాలా కంపెనీలు తక్కువ ధరకే ఈవీ స్కూటర్లను లాంచ్ చేస్తున్నాయి. తాజాగా ప్రముఖ కంపెనీ బజాజ్ తన చేతక్ ఈవీను రూ.లక్ష కంటే తక్కువ ధరకు లాంచ్ చేసింది. బజాజ్ ఆటో భారతదేశంలో చేతక్ 3001 ఎలక్ట్రిక్ స్కూటర్‌ను రూ. 99,990 (ఎక్స్-షోరూమ్) ధరతో విడుదల చేసింది. ఈ ఈ-స్కూటర్ చేతక్ 35 సిరీస్‌పై నిర్మించారు. చేతక్ 3001 సింగిల్ ఛార్జ్‌లో 127 కి.మీ రైడింగ్ రేంజ్, 35-లీటర్ల అండర్-సీట్ స్టోరేజ్‌తో వస్తుంది. ఈ స్కూటర్ ఫ్లోర్‌బోర్డ్-మౌంటెడ్ 3.0 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ, 750 వాట్స్ ఛార్జర్ ప్రామాణికంగా వస్తుంది. 0 నుంచి 80 శాతం వరకు ఛార్జ్ చేయడానికి దాదాపు నాలుగు గంటలు పడుతుంది.

స్కూటర్ కాల్, మ్యూజిక్ కంట్రోల్స్, హిల్ హోల్డ్, రివర్స్ లైట్, గైడ్-మీ-హోమ్ ల్యాంప్స్ ఉన్న అదే ఇన్స్ట్రుమెంటేషన్‌ను పొందుతుంది. స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ కూడా ఉంది చేతక్ 3001 బుకింగ్‌లు అన్ని షోరూమ్‌లలో ప్రారంభమయ్యాయి. అలాగే ఈ నెలాఖరు నుండి డెలివరీలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ఈ -స్కూటర్‌ను ఎరుపు, నీలం, పసుపు రంగుల్లో అందుబాటులో ఉంటుంది.

# టెస్టు కెప్టెన్సీని నేనే వద్దనుకున్నా

### స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా




**న్యూఢిల్లీ:** టీమ్ఇండియా స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ టెస్టులకు గుడ్ బై చెప్పడంతో జట్టుకు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రానే కెప్టెన్ అవుతాడని అందరూ భావించారు. అప్పటికే రోహిత్?కు డిప్యూటీగా ఉన్న బుమ్రాకు సెలక్టర్లు కెప్టెన్?గా ప్రమోషన్ ఇవ్వడం పక్కా అనుకున్నారు. కానీ, యంగ్ బ్యాటర్ శుభ్?మన్ గిల్? వైపు మొగ్గు చూపిన సెలక్షన్ కమిటీ అతడికి జట్టు పగ్గాలు అప్పగించింది. దీంతో సీనియర్ బుమ్రాను కాకుండా గిల్?కు నాయకత్వ బాధ్యతలు ఇవ్వడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. దీనిపై బుమ్రా తాజాగా స్పందించాడు. టెస్టు కెప్టెన్సీని తానే వద్దనుకున్నట్లు బుమ్రా తెలిపాడు. ఈ విషయాన్ని బీసీసీఐకు ఐపీఎల్ సమయంలోనే చెప్పినట్లు పేర్కొన్నాడు. రీసెంట్?గా మాజీ ప్లేయర్ దినేశ్ కార్తీక్‌తో ఓ టీవీ కార్యక్రమంలో బుమ్రా మాట్లాడాడు. ఈ సందర్భంగా తాను టెస్టు కెప్టెన్సీని తిరస్కరించడానికి కారణాలు చెప్పాడు. వర్క్? లోడ్ కారణంగానే కెప్టెన్సీ వద్దనుకున్నానని చెప్పాడు. నాయకత్వం కన్నా బౌలింగ్‌కే ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నట్లు వివరించాడు.

'నా నిర్ణయం వెనుక పెద్ద పెద్ద కథలు లేవు. కాంట్రవర్సీలు కూడా లేవు. ఐపీఎల్ సమయంలో రోహిత్, విరాట్ రిటైర్ కాకముందే నేను బీసీసీఐతో మాట్లాడాను. ఇంగ్లాండ్‌తో 5మ్యాచ్‌ల సిరీస్‌లో నా వర్క్?లోడ్ గురించి చర్చించా. నా వెన్ను పరిస్థితి గురించి సంబంధిత వ్యక్తులతోనూ మాట్లాడాను. సర్జన్‌ను కూడా సంప్రదించాను. వర్క్?లోడ్? విషయంలో ఎంత తెలివిగా ఉండాలో వాళ్లెప్పుడూ చెబుతుంటారు. వాళ్లతో చర్చించిన అనంతరం కొంచెం తెలివిగా ఉండాలని నిర్ణయించుకున్నా. ఆ తర్వాత బీసీసీఐతో మాట్లాడా. కెప్టెన్సీ రేస్?లో నన్ను పరిగణనలోకి తీసుకోవద్దని చెప్పేశా"బీసీసీఐ నాకు కెప్టెన్సీని బాధ్యతలు ఇవ్వాలని భావించింది. కానీ నేనే వద్దన్నాను. ఎందుకంటే, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో మూడు మ్యాచ్‌లకు ఒకరు, రెండు మ్యాచ్‌లకు ఇంకొకరు కెప్టెన్‌గా ఉండడం కరెక్ట్? కాదు. నేను జట్టు ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తా. కెప్టెన్‌గానే కాదు. ఆటగాడిగా కూడా జట్టుకు ఎంతో చేయగలను. కెప్టెన్సీ ఒక హోదా. కెప్టెన్సీ గొప్ప గౌరవం. బాగా కష్టపడడం వల్లే నాకు ఆ అవకాశం వచ్చింది. నేను ప్లేయర్?గా జట్టుకు ఎక్కువ సేవ చేయాలనుకుంటున్నా. అది బీసీసీఐ కూడా చెప్పా' అని బుమ్రా వివరించాడు.టెస్టుల్లో బుమ్రా ఇప్పటికి మూడు మ్యాచ్?ల్లో జట్టను నడిపించాడు. 2022లో ఇంగ్లాండ్?పై మ్యాచ్?లో తొలిసారి కెప్టెన్సీ వహించాడు. మూడు మ్యాచ్‌ల్లో 1 టెస్టులో టీమ్ఇండియా నెగ్గింది. మరో రెండింట్లో ఓడింది.

## రెడిట్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్



**న్యూఢిల్లీ:** రెడిట్ సోషల్ మీడియా సంస్థకు.. భారత లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు. క్రీడా వర్గాల్లో, క్రీడా అభిమానుల్లో తమ ఫ్లాట్‌ఫామ్‌ను విస్తరించాలన్న ఉద్దేశంతో సచిన్‌ను అంబాసిడర్‌గా నియమించినట్లు తెలుస్తోంది. తన అఫీషియల్ రెడిట్ అకౌంట్ ద్వారా సచిన్ అభిమానులకు అందుబాటులో ఉండాడు. ఆ ఫ్లాట్‌ఫామ్‌లో యూజర్స్‌తో యాక్టివ్‌గా ఎంగేజ్ అవుతాడు. సబ్‌రెడిట్స్‌తో చర్చల్లో సచిన్ పాల్గొననున్నాడు. పర్సనల్ స్టోరీలు, మ్యాచ్ విశ్లేషణలు, విశిష్టమైన కాంటెంట్‌ను తన ఫ్యాన్స్ సచిన్ షేర్ చేసుకోనున్నారు. భారత క్రికెట్, భారతీయ క్రీడల గురించి రెడిటర్స్‌తో చర్చించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు సచిన్ పేర్కొన్నారు. ఫ్యాన్స్‌తో కొత్త రీతిలో తమ అనుభవాల్ని పంచుకునే అవకాశం వచ్చిందన్నారు.

## ఇంగ్లండ్‌కు సూర్యకుమార్..

### స్పోర్ట్స్ హెర్నియాకు ట్రీట్‌మెంట్

**న్యూఢిల్లీ:** టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇంగ్లండ్‌కు పయనమయ్యాడు. అతను అక్కడ శస్త్ర చికిత్స చేయించుకోనున్నాడు. గజ్జల్లో గాయానికి అతను ట్రీట్మెంట్ తీసుకోనున్నాడు. ఒకవేళ అవసరం అయితే స్పోర్ట్స్ హెర్నియాకు శస్త్ర చికిత్స తీసుకునే అవకాశాలు ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో.. సూర్యకుమార్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఆ టోర్నీలో అతను ముంబై ఇండియన్స్ తరపున 700 పైగా రన్స్ స్కోర్ చేశాడు. ఆ తర్వాత ఈ మధ్యే ముంబై ప్రీమియర్ లీగ్ టీ20 కూడా ఆడాడతను. అయితే ముంబై టీ20 టోర్నీ ఆడుతున్న సమయంలో.. అతని గజ్జల్లో నొప్పి మరింత తీవ్రమైనట్లు తెలుస్తోంది. వరుసగా బ్రేక్ లేకుండా క్రికెట్ ఆడడం వల్ల కూడా సమస్య అధికంగా అయినట్లు అనుమానిస్తున్నారు. స్పోర్ట్స్ హెర్నియా చికిత్స కోసం యూకేకు సూర్య వెళ్లినట్లు ఓ బీసీసీఐ అధికారి ద్వారా తెలిసింది. అయితే మళ్లీ ఆగస్టు నెల వరకు టీ20 మ్యాచ్‌లు లేకపోవడంతో.. ఈ సమయంలో ట్రీట్మెంట్ తీసుకోవాలని సూర్య భావించాడు. చికిత్స ముగిసిన తర్వాత బెంగుళూరులోని ఎక్సలెన్సీ సెంటర్‌లో కోలుకునే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు.




## పేసర్ హర్షిత్ రాణాకు గోల్డెన్ ఛాన్స్

### భారత్- ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌కు ఎంపిక

**న్యూఢిల్లీ:** టీమ్ఇండియా యంగ్ పేసర్ హర్షిత్ రాణాకు గోల్డెన్ ఛాన్స్ దక్కింది. అతడు ఇంగ్లాండ్ టెస్టు సిరీస్?లో తొలి మ్యాచ్?కు ఎంపికయ్యాడు. భారత్ జట్టులో అతడిని చేర్చుతున్నట్లు బీసీసీఐ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు ఓ పోస్ట్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. 'ఇంగ్లాండ్?తో తొలి టెస్టు కోసం హర్షిత్ రానా టీమ్ఇండియాతో చేరనున్నాడు' అని ట్వీట్ చేసింది.అయితే ఇటీవల ఇండియా ఏ జట్టుకు ఎంపికైన హర్షిత్ ప్రస్తుతం ఇంగ్లాండ్?లోనే ఉన్నాడు. అక్కడ ఇండియా ఏ తరపున ఆడిన రాణాను బీసీసీఐ తిరిగి భారత్?కు పంపలేదు. అలాగే వర్క్ లోడ్ కారణంగా బుమ్రా ఆడని మ్యాచ్?ల్లో హర్షిత్ బరిలో దిగే ఛాన్స్ ఉంది. కాగా, హర్షిత్ గతేడాది ఆస్ట్రేలియా సిరీస్?లో టెస్టు అరంగేట్రం చేశాడు. కానీ ఆ సిరీస్?లో పెద్దగా ప్రభావం చూపలేదు. 2 మ్యాచ్?ల్లో నాలుగే వికెట్లు పడగొట్టాడు.




తొలి టెస్టుకు భారత జట్టు : శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా

భారత్‌తో తొలి టెస్టుకు ఇంగ్లాండ్ జట్టు : షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్సే, సామ్ కుక్, జాక్ క్రాలే, బెన్ డకెట్, జామీ ఓవర్టన్, ఆలీ పోప్, జో రూట్, జామీ స్మిత్ (వికెట్), బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోష్ టోక్స్, క్రిస్

# వెండిమబ్బులలో అందాల జాబిలమ్మ



టాకీస్: తెలుగు సినీరంగంలో హిట్స్ అందుకున్నప్పటికీ అవకాశాలు అందుకోని హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్. ఈ అమ్మడు నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అయ్యాయి. కానీ ఇప్పటికీ ఈ బ్యూటీకి సరైన ఆఫర్స్ రాలేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంది. తెలుగులో తొలి చిత్రంతోనే నటిగా ప్రశంసలు అందుకుంది ప్రగ్యా జైస్వాల్. అందం, అద్భుతమైన నటనతో ప్రేక్షకులను కట్టిపడేసిన ప్రగ్యా.. ఇప్పటివరకు సరైన బ్రేక్ అందుకోలేదు. అంతేకాదు.. స్టార్ హీరోల సరసన నటించినప్పటికీ ఈ బ్యూటీకి అంతగా క్రేజ్ రాలేదు. తెలుగులో పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. టాలీవుడ్ ఇండస్ట్రీలో యంగ్ హీరోలతోపాటు పలువురు స్టార్స్ సరసన నటించిన ప్రగ్యా.. ఇప్పుడు ఇండస్ట్రీలో సైలెంట్ అయ్యింది. తాజాగా ఆమె ఉత్తమ నటిగా గద్దర్ అవార్డ్ అందుకుంది. వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన కంచె సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమాలో అద్భుతమైన నటనతో కట్టిపడేసింది. కంచె సినిమాలో తన నటనకుగానూ ఉత్తమ నటిగా గద్దర్ అవార్డ్ అందుకుంది. అలాగే బాలకృష్ణ నటించిన అఖండ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ మూవీతో తన నటనకు ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా తర్వాత వరుసగా అవకాశాలు వస్తాయి అనుకున్నారు. కానీ ఆ అదృష్టం ఆమెకు కలిసిరాలేదు. ఈ సినిమా తర్వాత ప్రగ్యాకు అంతగా ఆఫర్స్ అంతగా రాలేదు. ప్రస్తుతం బాలయ్య నటిస్తోన్న అఖండ సీక్వెల్ అఖండ 2లో నటిస్తుంది. అలాగే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా ఆమె సిల్వర్ చీరలో అందమైన జాబిలమ్మగా మెరిసిపోతుంది. వెండిమబ్బులలో మెరిసిన వెన్నెలమ్మగా కనిపిస్తుంది. ప్రగ్యా జైస్వాల్.. మధ్యప్రదేశ్ లోని జబల్ పూర్ లో జన్మించింది. పూణేలోని సింబయాసిస్ లా స్కూల్లో చదివింది. సింబయాసిస్ యూనివర్సిటీలో చదువుతున్న రోజుల్లోనే అందాల పోటీలలో పాల్గొంది. మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ప్రగ్యా జైస్వాల్ ఫెమినా మిస్ ఇండియా 2008లో పోటీల్లో పాల్గొని మిస్ ఫ్రెష్ ఫేస్ టైటిల్ గెలుచుకుంది.

# చిరును డ్రిల్ మాస్టర్ చేసిన అనిల్ రావిపూడి



టాకీస్: అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఓ సినిమా రూపొందుతున్నది. సంక్రాంతికి వస్తున్నాం మూవీ తర్వాత అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్నా ఈ సినిమాపై ఇప్పటి నుండే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను భారీ చిత్రాల నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి,సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిరు సరసన నయనతార హీరోయిన్ గా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముస్సోరీలో జరుగుతోంది. చిరంజీవి, కేథరిన్ మరియు నయనతార కాంబినేషన్‌లో ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాడు దర్శకుడు అనిల్ రావిపూడి. అయితే ఈ సినిమాలో మెగాస్టార్ చిరు స్కూల్ లో పిల్లలకు ఆటలు నేర్పించే డ్రిల్ మాస్టర్ పాత్రలో కనిపించబోతున్నాడు. బాలయ్యను కేర్ టేకర్ గా వెంకీ ని కాప్ రోల్ లో చూపించి మెప్పించిన ఈ యంగ్ డైరెక్టర్ ఇప్పుడు చిరును డ్రిల్ మాస్టర్ గా చూపిస్తున్నారు. ఈ సినిమాతో వింటేజ్ చిరు మరోసారి ప్రేక్షకులను అలరిస్తాడని మెగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. మాస్ మ్యూజిక్ స్పెషలిస్ట్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న చిరు అనిల్ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని ఇదివరకే ప్రకటించారు మేకర్స్. అందుకు అనుగుణంగానే షూట్ ను చక చక ఫినిష్ చేస్తున్నారు. భారీ అంచనాల మధ్య వస్తున్న చిరు అనిల్ కాంబో ఎంతటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

# కియారా కోసం యష్ త్యాగం



టాకీస్: కేజీఎఫ్' సిరీస్ ద్వారా దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న కన్నడ స్టార్ యష్.. తన కొత్త ప్రాజెక్ట్ 'టాక్సిక్' కోసం మరింత ఆసక్తికరంగా ప్రిపేర్ అవుతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా, ఇప్పటికే యష్ బర్త్‌డే స్పెషల్‌గా విడుదలైన గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ లభించింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ కూడా నటిస్తున్నారు. అయితే చిత్ర షూటింగ్ మొదలైన కొద్దికాలానికే కియారా గర్భవతిగా మారిన విషయం తెలిసిందే.

అయితే గర్భవతిగా ఉన్న కియారాకు షూటింగ్ షెడ్యూల్ సులభంగా ఉండాలనే ఉద్దేశంతో, యష్ తన భాగమైన కొన్ని ముఖ్యమైన సన్నివేశాల షూటింగ్‌ను, బెంగళూరులో కాకుండా, ముంబైకి మార్చాలని నిర్ణయించారట. దీంతో ఆమెకు ప్రయాణ బాధ్యత తగ్గింది. ముంబైలోనే యష్, కియారాల మధ్య సన్నివేశాలను, త్వరగా షూట్ చేసి పూర్తి చేశారట. ఈ విషయం బయటకు వచ్చాక, యష్



సెన్సిటివిటీ, సహనభావం చూసిన ప్రేక్షకులు, అభిమానులు ఆయన పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఒక నటీమణి ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, షూటింగ్ లొకేషన్ మార్చడం నిజంగా అరుదైన విషయం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక ఈ భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.

# కన్నప్ప విడుదలకు ఏపీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్



టాకీస్: మంచు విష్ణు కథానాయకుడిగా.. మంచు మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న కన్నప్ప సినిమాపై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో కొన్ని సన్నివేశాలు బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఉన్నాయని ఆరోపిస్తూ సినిమా విడుదలను ఆపివేయాలని బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు వెంకట శ్రీధర్ ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

అయితే ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా.. సినిమా విడుదలను ఆపివేయాలనే పిటిషనర్ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. అలాగే ఈ వివాదంకి సంబంధించి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ సీఈఓ, ప్రాంతీయ కార్యాలయ అధికారి, ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, దర్శకుడు ముఖేష్ కుమార్, అలాగే నటులు మోహన్ బాబు, విష్ణు, కన్నెగంటి బ్రహ్మానందం, పి. వెంకట ప్రభుప్రసాద్, సప్తగిరిలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 1కి వాయిదా వేసింది.

అలాగే సినిమా విడుదలైన తర్వాత అభ్యంతరకర విషయాలు ఏమైనా ఉంటే, వాటిని తొలగించేలా ఆదేశిస్తామని న్యాయమూర్తి స్పష్టం చేశారు. దీంతో, 'కన్నప్ప' చిత్రం విడుదలకు హైకోర్టు నుంచి పరోక్షంగా గ్రీన్ సిగ్నల్ లభించినట్టయింది.




## 'హరిహర వీరమల్లు'కి పోటీగా వస్తున్న

# విజయ్ 'కింగ్‌డమ్'.!

టాకీస్: రౌడీ హీరో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం కింగ్‌డమ్. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నాడు. గత నెల మే 30న విడుదల కావాల్సి ఉన్న ఈ చిత్రం పలు కారణాల వలన వాయిదా పడుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఫస్ట్ టైం పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు వస్తుదంటూ పోస్ట్ పోన్ చేసుకున్నారు మేకర్స్ కానీ.. ఈ తేదీకి వీరమల్లు కూడా రాకపోవడంతో తేదీ వృధాగా పోయింది. ఆ తర్వాత ఇండియా పాకిస్థాన్ మధ్య పరిస్థితులు సరిగ్గా లేకపోవడంతో ఈ సినిమాను జూలై 04న తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. అయితే ఈ తేదీ కూడా క్యాన్సిల్ అవ్వడంతో తాజాగా మరో డేట్ ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఈ సినిమాను జూలై 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు సమాచారం. అయితే కింగ్‌డమ్ వచ్చే కంటే ఒకరోజే ముందే వీరమల్లు రాబోతుంది. హరిహర వీరమల్లుని జూలై 24న విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే రెండు సినిమాలకు గట్టి పోటి ఉండబోతుందని సమాచారం.

కింగ్‌డమ్ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నది. సత్యదేవ్ కీలకపాత్రలో నటిస్తున్నాడు. అనిరుధ్ రవిచంద్ర మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్‌ను హైదరాబాద్, విశాఖపట్నం, కేరళ, శ్రీలంకలో చిత్రీకరించినట్లు సమాచారం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.